




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 275 | ది. 10-1-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 275 | Date : 10-1-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


# మీ భూమి... మీ హక్కు

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ సభలో సీఎం చంద్రబాబు

- ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టు రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు
- రైతుల భూములకు భరోసా ఇచ్చేందుకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు
- రీ-సర్వేలో తప్పులుంటే అధికారులపై చర్యలు తీసుకుంటాం
- పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు... పెత్తనం భరించనక్కర్లేదు
- వివాదాలు సృష్టించే ప్రభుత్వం కాదు... పరిష్కరించే ప్రభుత్వం
- టెక్నాలజీతో ట్యాంపరింగ్ ఫ్రీ డాక్యుమెంట్లు
- భూములను లాక్కోలేరు... రికార్డులు తారుమారు చేయలేరు




**తూర్పు గోదావరి జిల్లా/మండపేట,జనవరి 9 (వార్తాప్రభ) :** మీ భూమి-మీ హక్కు. ఇదీ రైతులకు, భూ యజమానులకు ప్రభుత్వం ఇచ్చే భరోసా అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రైతులకు వివాదాల్లేని క్లీన్ డాక్యుమెంట్లు ఇచ్చే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని... ఆ దిశగానే భూముల రీ-సర్వే చేపడుతున్నామని సీఎం వెల్లడించారు. మండపేట నియోజకవర్గం, రాయవరంలో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శుక్రవారం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన చంద్రబాబుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా రాయవరంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులతో సీఎం ముఖాముఖి మాట్లాడారు. క్యూఆర్ కోడ్, విశిష్ట సంఖ్య ఉన్న, మీ భూమి..మీ హక్కు పేరిటి రైతులకు రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. క్యూఆర్ కోడ్ ద్వారా తక్షణం భూమి వివరాలు తెలుసుకునేలా పట్టాదారు పాస్ పుస్తకాలను రెవెన్యూ శాఖ ముద్రించిందని రైతులకు సీఎం వివరించారు. రైతులు, భూ యజమానుల ఆస్తులకు భద్రత కల్పించేలా కొత్త టెక్నాలజీతో ట్యాంపరింగ్ చేసేందుకు వీళ్ళేకుండా పట్టాదారు పాస్ పుస్తకం తయారు చేసినట్టు చెప్పారు. రీసర్వే పూర్తైన 6688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్ పుస్తకాలు ముద్రించగా... ప్రస్తుతం వాటిని పంపిణీ చేస్తున్నట్టు రైతులతో సీఎం చెప్పారు. రైతులు, భూ యజమానులకు తప్పుల్లేని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు శ్రద్ధ పెట్టాలని సీఎం సూచించారు. అనంతరం మీ భూమి- మీ హక్కు ప్రజావేదిక నుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ...' 'పూర్వీకుల నుంచి సంక్రమించిన, స్వార్జితమైన భూమితో రైతులకు ఓ అనుబంధం ఉంది. కరోనా సమయంలో అంతా సెలవు తీసుకున్నారు. కానీ అందరికీ అన్నం పెట్టే రైతన్నకు సెలవే లేదు. అలాంటి రైతులకు చెందిన భూ పత్రాల విషయంలో గత పాలకులు పాస్ పుస్తకాల జారీకి సంబంధించి అక్రమాలు చేశారు. గత పాలకుల్ని, ప్రభుత్వాన్ని హెచ్చరించాను. కానీ వారి అహంకారం నెత్తికెక్కి మీ ఆస్తులపై ఆయన ఫోటో వేసుకున్నారు. పూర్వీకులు ఆర్జించిన భూమిపై నాటి పాలకుని ఫోటో ఏమిటి.? సరిహద్దు రాళ్లపై గత పాలకుని ముద్రలేమిటి? ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అంటూ ఓ చట్టాన్ని తెచ్చి వాళ్లకు నచ్చిన వాళ్ల ఆధీనంలోకి తీసుకువచ్చేలా చేశారు. దీనిని గతంలోనే తీవ్రంగా వ్యతిరేకించాను. మీ భూముల వివరాలన్నీ గత పాలకుల అనుచరులు అమెరికాలో పెట్టుకున్నారు. కూటమి అధికారంలోకి రాకపోతే ప్రజల భూములన్నీ కాజేసేందుకు కుట్రపన్నారు. నిన్నా మొన్నా రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తులు చాలా ప్రమాదకరమైన ఆలోచన చేశారు. రైతుల భూలపై వేరేవాళ్ల ఫోటోలెందుకని ప్రశ్నించాను. ప్రభుత్వంలోకి వచ్చాం... రాజముద్ర వేసి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చాం. గత పాలకులు తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ రెండో సంతకమే పెట్టాను. భూమి అనేది రైతుకు ఆస్తి మాత్రమే కాదు ఓ విశ్వాసం, కుటుంబంతో కలిసిపోయిన సెంటిమెంట్. గతంలో భూమి ఇవ్వకపోతే దానిని 22 ఏ రికార్డుల్లో పెట్టేశారు. అందుకే ప్రజలు ఆలోచించి సమయం వచ్చినప్పుడు చూద్దామని బ్యాలెట్ ద్వారా తగిన బుద్ధి చెప్పారు. ఏపీ ప్రాంతంలో ఉన్న రికార్డులు అన్నీ పక్కాగా ఉన్నాయి. తెలంగాణా ప్రాంతంలో ఎక్కువ భూవివాదాలే. మున్సబు, కరణాల వ్యవస్థను రద్దు చేసి ఎన్టీఆర్ రైతులకు, భూ యజమానులకు మేలు చేశారు. ఈ వ్యవస్థ రద్దైనప్పుడు తెలంగాణాలో పండుగ చేసుకున్నారు. గత పాలకుల తీరు కారణంగా ఎక్కడకు వెళ్లినా భూ వివాదాలకు సంబంధించిన పిటిషన్లే వస్తున్నాయి. ఈ వివాదాలను పరిష్కరించేందుకు సంకల్పించి మీ వద్దకు వచ్చాను."అని సీఎం చెప్పారు.

# పిఠాపురం ప్రజల మధ్య ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- సంక్రాంతి సంబరాల ప్రారంభోత్సవం
- అనంతరం పట్టణంలో క్షత్ర స్థాయి పర్యటన
- పాదయాత్ర చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి
- ప్రతి ఒక్కరినీ పలుకరిస్తూ ముందుకు సాగిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



**పిఠాపురం,జనవరి 9 (వార్తాప్రభ) :** తన నియోజకవర్గం ప్రజలని కలుసుకునేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం పట్టణంలో క్షత్ర స్థాయి పర్యటన చేపట్టారు. పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలను ప్రారంభించిన అనంతరం పట్టణంలో కాలినడకన ప్రజల వద్దకు వెళ్లి, వారితో ముచ్చటిస్తూ సమ-స్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పిఠాపురం ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి..** ఆర్.ఆర్.బి.హెచ్.ఆర్. కళాశాల మైదానం నుంచి పవన్ కళ్యాణ్ వెలుపలికి రాగానే పలువురు ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు నిల్చుని ఉన్నారు. వారి సమ-స్యలు తెలుసుకునేందుకు వాహన శ్రేణి నుంచి దిగిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అక్కడి నుంచి శ్రీ కుక్కుటేశ్వరస్వామి వారి ఆలయం వరకు ప్రజల్ని పలుకరిస్తూ కాలినడకన ముందుకు సాగారు. శ్రీమతి పెద్దింటి అనంత పద్మావతి అనే మహిళ తమకు ఇంటి స్థలం కావాలని కోరారు. మరో మహిళ తమ ఇళ్ల వద్ద విద్యుత్ తీగలు సాగిపోయి కిందికి వచ్చేసి ప్రమాదకరంగా ఉన్నాయని, సాగిపోయిన విద్యుత్ తీగలు తగిలి అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయన్న విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రివర్యులు అధికారులను ఆదేశించారు. పిఠాపురం పోలీసు స్టేషన్ పరిశీలన అనంతరం పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పరిశీలించారు. స్టేషన్లో ఉన్న గదులను చూసి పిఠాపురంలో శాంతి భద్రతల తీరుపై ఆరా తీశారు. స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో ఫొటోలు దిగారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చి కుక్కుటేశ్వరస్వామి ఆలయ సమీపంలో యానాదుల కాలనీవాసులను పలుకరించారు. శ్రీ దుర్గా ప్రసాద్ అనే వ్యక్తి యానాదుల కాలనీలో పక్కా ఇళ్లు నిర్మించాలని, డ్రయినేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గారికి చెప్పుకున్నారు. శ్రీ కుక్కుటేశ్వర స్వామి ఆలయం వెలుపల ఉన్న దుకాణదారులను పలకరించి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. చివరిగా ఆలయ అర్చకులతో మాట్లాడి వారితో ఫొటోలు దిగారు. ఉప ముఖ్యమంత్రి వెంట జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్,ఇతర అధికారులు ఉన్నారు.



# సింగరేణికి సున్నం!!

- పెడుతున్న పాత్రికేయులకు దావత్, గిఫ్ట్స్
- లక్షల రూపాయల క్వార్టర్ల అద్దె బకాయిలు
- సింగరేణిలో ఏ డివిజన్లలో లేని నియమాలు ఆర్జీవన్ లో మాత్రమే
- పెద్ద మీడియా, చిన్న మీడియా అని వర్గాలుగా చేసి అవమానం చేస్తున్న అధికారులు
- క్లబ్ పేరిట ఇచ్చే లెటర్లకు సలాం కొడుతున్న ఆఫీసర్స్
- పక్షపాత ధోరణిపై విమర్శల జడి







**పెద్దపల్లి/ గోదావరిఖని,జనవరి 9 (వార్తాప్రభ) :** సింగరేణి సంస్థకు తలమానికంగా ఉండాల్సిన ఆర్జీ-1 డివిజన్ ప్రస్తుతం వివాదాలకు నిలయంగా మారింది. సంస్థ ప్రయోజనాలను గాలికొదిలేసి, కొందరు అధికారులు అనుసరిస్తున్న తీరు కార్మిక వర్గాల్లో ,స్థానిక మీడియా ప్రతినిధులలో తీవ్ర అసహనాన్ని నింపుతోంది. సంస్థ సొమ్ముతో 'దావత్‌లు'.. గిఫ్టల పర్వం సింగరేణికి సున్నం పెడుతూ, సంస్థకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కొందరు పాత్రికేయులకు అధికారులు రాజమర్యాదలు చేయడం చర్చనీయాంశంగా మారింది. సంస్థ ప్రతిష్టను దెబ్బతీసే వారికి సైతం లక్షల రూపాయల ఖర్చుతో 'దావత్‌లు', ఖరీదైన గిఫ్ట్‌లు అందజేస్తూ మేనేజ్‌మెంట్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**క్వార్టర్ల అద్దె బకాయిల బాగోతం..** సామాన్య కార్మికుడికి నిబంధనలు వర్తింపజేసే అధికారులు, ప్రభావవంతమైన వ్యక్తుల విషయంలో మాత్రం మౌనం వహిస్తున్నారు. క్వార్టర్ల అద్దె రూపంలో లక్షలాది రూపాయల బకాయిలు పేరుకుపోయినా, వాటిని వసూలు చేయడంలో అధికారులు మీనమేషాలు లెక్కించడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మీడియాలో 'పెద్ద - చిన్న' వివక్ష. పాత్రికేయ రంగంలో వర్గ విభేదాలను సృష్టిస్తూ అధికారులు కొత్త సంప్రదాయానికి తెరలేపారు. 'పెద్ద మీడియా - చిన్న మీడియా' అని వర్గాలుగా విభజించి, కొందరికి మాత్రమే ప్రాధాన్యతనిస్తూ మిగిలిన వారిని అవమానపరుస్తున్నారు. సమాచార వ్యాప్తిలో పారదర్శకత లోపించి, కేవలం తమకు అనుకూలంగా ఉండేవారికి మాత్రమే అధికారులు సలాం కొడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. క్లబ్ లెటర్లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారట. మిగతా డివిజన్లలో లేని వింత పోకడలు ఆర్జీ-1లో కనిపిస్తున్నాయి. కేవలం కొన్ని క్లబ్బుల పేరుతో వచ్చే లెటర్లకు అధికారులు తలొగ్గుతున్నారు. నియమ నిబంధనలను పక్కనపెట్టి, క్లబ్ సిఫార్సులకే పెద్దపీట వేస్తుండటం ఇక్కడి ప్రత్యేకతగా మారింది. సింగరేణి సంస్థను నష్టాల బాట పట్టిస్తున్న ఇటువంటి పోకడలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఆర్జీ-1 లో జరుగుతున్న మీడియా వివక్షపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు, వారు సర్టిఫికెట్ ఇచ్చిన చిన్న మీడియా జర్నలిస్టులు డిమాండ్ చేస్తున్నారు.

# డైరీ రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

- మహిళా సాధికారత, గ్రామీణ ఉపాధులకు డైరీ రంగం ప్రధాన ఆధారం
- డైరీ రంగాన్ని లాభదాయకంగా మార్చడంలో ఇండియన్ డైరీ అసోసియేషన్ కీలక పాత్ర
- వ్యాపారంతో పాటు సామాజిక సేవలోనూ నారా భువనేశ్వరి విశేష కృషి చేస్తున్నారు
- కేరళలో సదరన్ డైరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్--2026 లో ప్రసంగించిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




**కేరళ,జనవరి 9 (వార్తాప్రభ) :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు డైరీ రంగం వెన్నెముకగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ ప్రాంతంలో సదరన్ డైరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్--2026 కార్యక్రమానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ ఉత్పత్తులను పరిశీలించి సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతులకు నిత్య ఆదాయం, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి కల్పించడంలో డైరీ రంగం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు పశుపోషణ ఆర్థిక భద్రతనిచ్చే మార్గంగా మారిందని, పాల ఉత్పత్తి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయని తెలిపారు. ప్రాచీన కాలం నుంచే పశుపోషణ మరియు డైరీ రంగం భారతీయ నాగరికత యొక్క ఆర్థిక, సామాజిక మరియు సాంస్కృతిక జీవితంలో కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా డైరీ రంగం జాతీయ ఆర్థిక వ్యవస్థకే కాకుండా గ్రామీణ జీవనోపాధులకు, మహిళా సాధికారతకు మరియు పోషకాహార భద్రతకు కూడా ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నారు. అందువల్ల ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మరియు శాస్త్రీయ అభివృద్ధులను అన్వయిస్తూ డైరీ రంగాన్ని మరింత బలోపేతం చేయడం మన అందరి సమిష్టి బాధ్యత అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. డైరీ రంగాన్ని మరింత లాభదాయకంగా, సార్థకంగా మార్చేందుకు శాస్త్రీయ మరియు సాంకేతిక పురోగతిని సమన్వయం చేస్తూ రంగాన్ని శక్తివంతం చేస్తున్న ఇండియన్ డైరీ అసోసియేషన్ చేసిన కృషిని మంత్రి హృదయపూర్వకంగా అభినందించారు. సదరన్ డైరీ అండ్ ఫుడ్ కాన్‌క్లేవ్--2026 గొప్ప విజయాన్ని సాధించి, దేశ డైరీ రంగం పురోగతికి గణనీయమైన తోడ్పాటు అందిస్తుందని ఆకాంక్షించారు. ఫెలిసిటేషన్‌కు సరైన వ్యక్తిని ఎంపిక చేసినందుకు కూడా ఇండియన్ డైరీ అసోసియేషన్‌ను అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. నారా భువనేశ్వరి , హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ వైస్ చైర్‌పర్సన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, అలాగే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అని మంత్రి పేర్కొన్నారు. మూడు దశాబ్దాల కృషి మరియు దూరదృష్టి గల నాయకత్వంతో హెరిటేజ్ ఫుడ్స్ భారతీయ డైరీ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ఆమె నాయకత్వంలో, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ ద్వారా ప్రతిష్ఠాత్మక గోల్డెన్ పీకాక్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్‌ను హెరిటేజ్ ఫుడ్స్ మూడు సార్లు పొందిందని మంత్రి గుర్తు చేశారు. నారా భువనేశ్వరి గారు కేవలం విజయవంతమైన వ్యాపారవేత్త మాత్రమే కాకుండా, దయాగుణాలు కలిగిన ఉత్తమ మానవీయ విలువలు గల వ్యక్తి కూడా అని అన్నారు.

# చింతా సీతయ్య జూనియర్ కళాశాల లో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**హనుమాన్ జంక్షన్, జనవరి 9 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం కానుమోలు చింతా సీతయ్య జూనియర్ కళాశాల లో సంక్రాంతి సంబరాలు కళాశాల ప్రిన్సిపల్ కృపావతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగినాయి. కృపావతి మాట్లాడుతూ తెలుగువారి అతిపెద్ద పండుగ సంక్రాంతి అని, సంక్రాంతి వచ్చిందంటే చిన్న పెద్ద అందరూ సంతోషంగా ఇంటికాడ గడుపుతారని, సాంప్రదాయబద్ధంగా అందరు జరుపుకుంటారని అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కళాశాల విద్యార్థిని,విద్యార్థులకు ముగ్గుల పోటీలు, కబడ్డీ, మరియు వాలీబాల్ పోటీలు నిర్వహించడం జరిగినది. ప్రిన్సిపాల్ కృపావతి మాట్లాడుతూ క్రీడారంగం మరియు ముగ్గుల పోటీలు ప్రతిభ కనబరచిన వారందరికీ శుభాకాంక్షలు తెలియచేసారు. ముగ్గులు పోటీల్లో పాల్గొన్న వారందరికీ బహుమతులను కళాశాల లెక్చరర్ చంద్రశేఖర్ స్పాన్సర్ చేశారు. కళాశాల లో జరిగిన ఆటల పోటీలు మరియు ముగ్గుల పోటిల ల్లో గెలిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతుల ను కాలేజీ ప్రిన్సిపాల్ కృపావతి, కెమిస్ట్రీ లెక్చరర్ రంగమ్మ, ఫిజిక్స్ లెక్చరర్ ఝాన్సీ, బోటనీ లెక్చర ర్ కామేశ్వరి, కామర్స్ లెక్చరర్ చంద్రశేఖర్, జూవలజీ లెక్చర ర్ సునీల్ చేతుల మీద బహుమతులు ప్రధాన చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ స్టాప్ మరియు విద్యార్థులు విద్యార్థులు పేరెంట్స్ పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి, విద్య--వైద్యం ప్రజలకు చేరువే కూటమి ప్రభుత్వ లక్ష్యం: యార్లగడ్డ వెంకట్రావు



**హనుమాన్ జంక్షన్, జనవరి 9 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు విద్య, వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. బాపులపాడు మండలం రెమల్లె గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న విలేజ్ క్లినిక్‌కు శంకుస్థాపన చేశారు...అనంతరం రూ.44 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రహదారులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కోట్ల రూపాయల వ్యయంతో గుంటలు లేని రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రజలకు చేరువగా మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆరోగ్య మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. మల్లవల్లి పారిశ్రామిక వాడ అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం రెమల్లె గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గత ప్రభుత్వ రీ-సర్వే కారణంగా ఏర్పడిన భూ సమస్యలను తక్షణమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అన్నదాత సుఖీభవ పథకం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన 299 సమస్యలను ఇప్పటికీ ఎందుకు ఓపెన్ చేయలేదని, రీ-ఓపెన్ శాతం 16 శాతంగా ఎందుకు ఉందని అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో బండ్రెడ్డి మురళీకృష్ణ, ఎంపిడీవో కె. జోగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, టీడీపీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయి కళ్యాణి, వేములపల్లి శ్రీనివాసరావు, పుట్టా సురేష్, కొల్లూరి చంద్రకాంత్, కలపాల కుమార్, మొవ్వ వెంకటేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, కలపాల సూర్యనారాయణ, వడ్లమూడి మూర్తి, యనమదల సుధాకర్, ఈడే నారాయణ, మవ్వ వేణుగోపాల్, అక్కినేని ధర్మరాజు, కాజా సురేష్, చేబత్తిన సుజాత, కొమ్మారెడ్డి రాజేష్, లంకా అజయ్ కుమార్, కర్రా ప్రసాద్ పాల్, కాటూరి విజయభాస్కర్, గరికపాటి వెంకటేశ్వరరావు, నిమ్మకూరి మధు, అక్కినేని గోకుల్, కొనకళ్ళ దుర్గారావు, బణావతుల ఆదియ్య తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటిక అభివృద్ధి నేపథ్యంలో బాలసౌరి, కాగిత ను కలసిన పట్టణ టీడీపీ నాయకులు



**పెడన,జనవరి 9 (వార్తాప్రభ) :** పెడన హిందూ స్మశాన వాటిక అభివృద్ధి నిమిత్తం సీ.ఎస్.ఆర్ ఫండ్స్ మంజూరులో ఉన్న సాంకేతిక అంశాలను హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ఎంపీ బాలశౌరి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కు వివరించడం జరిగింది. శుక్రవారం కృత్తివెన్ను మండల పరిధిలో పాల్గొనడానికి వచ్చిన ఎంపీ బాలశౌరి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ని కలిసి హిందూ స్మశాన వాటిక అభివృద్ధి లో జరుగుతున్న పురోగతికి రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు కమిటీ సభ్యులు తెలియజేశారు ఈ నేపథ్యంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి సంబంధిత కార్పొరేట్ సంస్థ ప్రతినిధులకు అధికారులకు వెంటనే ఫోన్ ద్వారా సంప్రదించి సీ.ఎస్.ఆర్ ఫండ్స్ విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయని హిందూ స్మశాన వాటిక వినియోగించుకున్న సామాజిక వర్గాల సహకారం కూడా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని గత రెండు రోజుల క్రితం సంబంధిత కార్పొరేట్ ప్రతినిధులను స్వయంగా కలవటం జరిగిందని ఎంపీ బాలశౌరి కమిటీ సభ్యులకు వివరించారు కార్యక్రమంలో అధ్యక్షుడు బొడ్డు దీక్షనందుడు కార్యదర్శి వాసా సాంబశివరావు వూటుకూరి ప్రకాశరావు బళ్ల ప్రసాద్ కమ్మగంటి వెంకటేశ్వరావు చందన నారాయణరావు పృథ్వీ వినోద్ తదితరులు పాల్గొన్నారు

## అన్న ప్రసాద వితరణ అందించిన విస్సన్నపేట లయన్స్ క్లబ్



**విస్సన్నపేట,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీ కావలి శంకరరావు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు మెరివిన్ జోన్స్( జనవరి 13 ) జయంతి సందర్భంగా అన్న ప్రసాద వితరణ అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రాయల అరుణకుమారి టీ జగన్మోహన రెడ్డి, డాక్టర్ ఎన్ టి వెంకటేశ్వరరావు, జగ్గవరపు రంగారెడ్డి, బాబు రాజేంద్రప్రసాద్, హెచ్ఎం రంగా శోభారాణి బొమ్మ రెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నరసాపురం గ్రామంలో పిచ్చికుక్క వీరవిహారం



**విస్సన్నపేట,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని నరసాపురం గ్రామంలో పిచ్చికుక్క సంచారంతో ప్రజలు భయభ్రాంతులవుతున్నారు. ఒక మహిళను, పలు గేదెలను పిచ్చికుక్క కరిసినట్లుగా విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతుంది . అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

## కోడి పందేలు నిషేధానికి పద్మవ్యూహం రచించిన మండల అధికారులు



**విస్సన్నపేట,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో సంక్రాంతి పండుగ సందర్భంగా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా మండల అధికారులు పద్మవ్యూహాన్ని రచించడం జరిగింది. గ్రామ గ్రామాన గతంలో కోడిపందాలు నిర్వహించిన మామిడి తోటల యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని ఎస్సై రామకృష్ణ తెలియజేశారు. మండల పరిధిలో కోడిపందాలు, గుండాట, జూదం, పులి మేక ఏనుగు, తదితర అసాంఘిక కార్యకలాపాలు నిషేధించడం జరిగిందని నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతోందని చెప్పారు. గతంలో కొందరిపై బైండోవర్ కేసులు పెట్టడం పెట్టడంతో వారు వెనుకడుగు వేశారన్నారు. గ్రామ గ్రామాన సచివాలయల పరిధిలో టీములు ఏర్పాటు చేసి మండల తాసిల్దార్ కే లక్ష్మ కళ్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు తదితరుల ప్రత్యక్ష పర్యవేక్షణలో సమిష్టిగా ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, గ్రామ కార్యదర్శి హరికృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రంగవల్లుల విజేతలకు బహుమతులు అందించిన లయన్ లలితా రామకృష్ణ దంపతులు



**విస్సన్నపేట,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక శ్రీ కావలి శంకరరావు జిల్లా పరిషత్ హై స్కూల్ నందు రంగవల్లుల పోటీల కార్యక్రమంలో 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు లయన్ లలితా రామకృష్ణ దంపతులు సహృదయంతో సేవే లక్ష్యంగా బహుమతులు అందించారు. ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు ఐదు స్పెషలు మరి ఒక ఐదు కన్సలేషన్ ప్రైజ్ లుతో పాటు సంక్రాంతి పండుగ సమయంలో పాల్గొన్నవారు అందరూ ఆనందంగా ఉండాలని మిగిలిన విద్యార్థునులకు కూడా వారు కూడా చిరునవ్వుతో ఇంటికి వెళ్లే లక్ష్యంగా ప్రత్యేక బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సుధాకర్,హెచ్ఎం రంగా శోభారాణి, లయన్ వీర్ల కిరణ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# వైభవోపేతంగా సంక్రాంతి సంబరాలు





**కాకినాడ/సామర్లకోట,జనవరి 9 (వార్తాప్రభ) :** లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల నందు శుక్రవారం నాడు సంక్రాంతి వేడుకలు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సురభి అపూర్వ భరత్ , ఆదిత్య విద్యాసంస్థల అధినేత డా. నల్లమిల్లి శేషారెడ్డి లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ డా.ఎన్. సుగుణా రెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ వందన బోహ్రా భోగి మంటతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సురభి అపూర్వ భరత్ మాట్లాడుతూ పండుగల ప్రాముఖ్యత వ్యక్తి మనసుపై చాలా ప్రభావం చూపుతాయి. కారణం అందులో నియమాలు మనిషికి మేలు చేసేవిగా ఉంటాయని పెద్దలు అంటారు. ముఖ్యంగా ప్రాతఃకాలంలో అంటే సూర్యోదయమునకు ముందే నిద్రలేవడం, తలస్నానం చేయడం, అందరి క్షేమం కోరుతూ దైవాన్ని పూజించడం, పిండివంటలు తయారు చేయడం, బంధువులను ఆహ్వానించడం గుడికి వెళ్ళి దైవదర్శనం చేయడం మొదలైనవి ఉంటాయి. ఇవి ఒక మనిషికి కొత్త ఉత్సాహం తెచ్చేవిగాను, శరీరానికి బలాన్ని అందించేవిగానూ ఉంటాయి. కొత్త బట్టలు కట్టుకోవడం మనసుకు సంతోషం. బంధు మిత్రులతో కలిసి పిండివంటలు తిని ఆరగించడం శరీరమునకు, మనసుకు కూడా ఆరోగ్యం అని ఆమె తెలిపారు. లక్ష్య ఇంటర్నేషనల్ పాఠశాల డైరెక్టర్ డా. సుగుణారెడ్డి మాట్లాడుతూ జీవన పరమార్ధం సాధించుకోవడంలో పండుగలు ప్రాముఖ్యత ఉంటుందని, విద్యార్థినీ విద్యార్థులు చిన్న వయసు నుండే మన ఆచారాలను తెలుసుకోవాలని, సంక్రాంతి పండుగ నెల రోజుల ముందు నుండే హరిదాసుల కీర్తనలతో ప్రారంభమవుతుందని, స్త్రీలందరూ తమ వాకిళ్లను చక్కటి రంగవల్లులతో నింపి, గొబ్బెమ్మలను పెట్టి ఎంతో శ్రద్ధగా గోదాదేవిని పూజిస్తారని మరియు రైతులు తాము పండించిన పంట చేతికి రావడంతో ఎంతో ఆనందంగా ఈ పండుగను జరుపుకుంటారని తమకు సహాయపడిన పశువులను పూజిస్తారని, ప్రజలందరూ ఎంతో ఆనందంగా రకరకాల పిండి వంటలను సిద్ధశీ చేసుకొని, బంధుమిత్రులతో కలసి చక్కగా జరుపుకుంటారని ఆమె తెలిపారు. భోగి, మకర సంక్రాంతి,కనుమ పండుగల ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. సంక్రాంతి పండుగ వెనుక ఉన్న వ్యవసాయ ప్రాధాన్యత, సంస్కృతి, సంప్రదాయాల గురించి అవగాహన కల్పించారు. పాఠశాల ప్రాంగణాన్ని పూలతో, అరటిచెట్లతో, ముగ్గులతో అలంకరించారు. ఉపాధ్యాయులు చిన్నారులపై భోగిపళ్లు పోసి, ఆయుష్షు, ఆరోగ్యం, విద్యాబుద్ధి కలగాలని ఆశీర్వదించారు. భోగిపళ్ల వేడుక పాఠశాల వాతావరణాన్ని పండుగ శోభతో నింపింది. అనడం అతిశయోక్తికాదు పాఠశాల ప్రిన్సిపాల్ వందన బోహ్రా మాట్లాడుతూ విద్యార్థులందరికీ మన పండుగలు,సంస్కృతి సాంప్రదాయాలు గూర్చి తెలియాలనే ఉద్దేశ్యంతో ఈ సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, పల్లెటూరి పండుగ వాతావరణంతో రకరకాల జానపద కళారూపాలతో ఏర్పాటు చేయడం జరిగిందని ఆమె తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు ముగ్గుల పోటీలు, గాలిపటాలు మొదలైన కృత్యాలు నిర్వహించారు. విద్యార్థులందరూ చక్కటి సాంప్రదాయ వస్త్రాలను ధరించి పలు రకాల గీతాలు, శ్లోకాలు, గోదా కళ్యాణ నృత్యాలను ప్రదర్శించి అందరినీ ఆనందపరిచారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు, పల్లె వాతావరణాన్నిజ్ఞప్తిక తెచ్చేల ఏర్పాటు చేసిన పర్ణశాల, ఎడ్లబండి, హరిదాసులు, గంగిరెద్దులవారు, కొమ్మదాసరులు, కోడిపందాలు,ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాయి.

# నంబూరి వేమూరి యూత్ ఆధ్వర్యంలో సంకురాత్రి సంబరాలు



**తిరువూరు,జనవరి 9 (వార్తాప్రభ) :** తిరువూరు రాజుపేట వేమూరు ఎస్టేట్ ఆవరణలో నంబూరు వేమూరి యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని నంబూరు మీడియా సమావేశంలో మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నాము సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతి సంవత్సరం నిర్వహిస్తూనే ఉన్నాము అందులో భాగంగా ఈ సంవత్సరం సంక్రాంతి చాలా ఆనందదాయకంగా జరుపుకోవాలని ముఖ్యంగా మహిళ మణులకు సంక్రాంతి లక్ష్మిని శోభని అందించే ముగ్గుల పండుగ ఇది ఆ ముగ్గుల పండగకి ప్రత్యేకంగా వేమూరి ఎస్టేట్స్ లో తిరువూరు పరిసర గ్రామాలకు మహిళలకు తిరువూరులో ఉన్నటువంటి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నాం ఈనెల 11 వ తారీకు ఉదయం 10 గంటలకు ప్రారంభించి అదే రోజు సాయంత్రం మన శంకర వరప్రసాద్ మెగాస్టార్ చిరంజీవి గారి సినిమా ప్రమోషన్ లాగా మరియు ఈ ముగ్గుల పోటీలో గెలుపొందినటువంటి మహిళా సోదరీమణులకు బహుమతి ప్రధానం చేయాలని చెప్పి మొదటి బహుమతిగా ?15 000 మూడో బహుమతిగా 5000 రూపాయలు మరియు అనేక ఆసక్తికరమైనటువంటి కన్సోలేషన్ ప్రైసెస్ పాల్గొన్న మహిళలకు అందించడం జరుగుతుందని వేమూరి శ్రీనివాస తెలిపారు చిరంజీవి అభిమాని ఎమ్మెల్యే కొలిక్కిపూడి శ్రీనివాసరావు గారు ఈ కార్యక్రమానికి విచ్చేయుచున్నారు ఉంటది కాబట్టి మహిళల కోసం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు కూడా వచ్చి ఆశీర్వదించి దిగ్విజయం చేస్తా రని

# మిన్నంటిన సంక్రాంతి సంబరాలు







**కైకలూరు,జనవరి 9 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చింతపాడు నందు సంక్రాంతి సంబరాలు శుక్రవారం మిన్నంటాయి. పిల్లల ఆనందోత్సాహాలతో భోగిమంటలతో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు చాలా ఆనందాన్ని వ్యక్తపరుస్తూ.. చక్కగా సంతోషంగా భోగి మంటలు వేసుకుంటూ సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఆడపిల్లలు మరియు ఉపాధ్యాయులు ముగ్గుల పోటీల్లో పాల్గొని సంక్రాంతి సంస్కృతిని చాటిచెప్పారు . మన భారతీయ సాంప్రదాయాలైన ముగ్గుల పోటీలు ఆటలు పోటీలు పతంగులు ఎగరవేయడం భోగి మంటలు జరుపుకోవడం లాంటి భారతీయ సంస్కృతిని విద్యార్థులు కు చాటి చెప్పడానికి ఈరోజు చింతపాడు ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాల్ని అంగరంగ వైభవంగా జరుపుకోవడం జరిగింది. ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు సాంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు వచ్చి విద్యార్థులకు సాంప్రదాయాల గురించి ఆదర్శవంతమైన అలవాట్లు గురించి చక్కగా చాటి చెప్పడం జరిగింది.

# కేంద్ర పథకాలపై ప్రజల్లో అవగాహన కలిగించాలి

### - బ్యాంకర్లకు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచన



**ఏలూరు,జనవరి 9 (వార్తాప్రభ) :** ఇతర జిల్లాలతో పోల్చితే ఏలూరు జిల్లాలో వ్యవసాయ రుణాలపై వడ్డీ రేటు ఎక్కువగా ఉందని, పంటల బీమా ప్రీమియం కూడా ఎక్కువగా ఉందని, తగ్గించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బ్యాంకర్లకు సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని గౌతమి సమావేశ మందిరంలో జరిగిన బ్యాంకర్ల సమీక్ష సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. వ్యవసాయ రుణాలు, ఎమ్ఎస్ఎమ్ఈ, పీఎం స్వానిధి లాంటి రుణాల అమలు తీరుపై బ్యాంకర్లను అడిగి తీసుకున్నారు. ప్రాథమిక రంగానికి రుణాల వితరణ, ఎంఎస్ఎంఈలకు ఆర్థిక సహకారం, వార్షిక రుణ ప్రణాళికలపై బ్యాంకుల ప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యేలకు నివేదికను అందజేశారు. 2025-26 సంవత్సరా నికి జిల్లాలో బ్యాంకులకు నిర్దేశించబడిన వార్షిక రుణ ప్రణాళిక మొత్తం రూ. 21,261 కోట్లుగా నివేదికలో పేర్కొన్నారు. ఇందులో వ్యవసాయ రుణాలకు కేటాయింపు రూ. 13,845 కోట్లు. మొత్తం ప్రణాళిక వ్యయంలో ఇది 65.11%. డిసెంబర్, 2025 నాటికి బ్యాంకులు డిఆర్డిఏ పరిధిలోని 15,535 గ్రూపులకు రూ. 1,421.17 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించుకోగా, ఇప్పటివరకూ 13,562 గ్రూపులకు రూ. 1,233.67 కోట్లు ఆర్థిక సహాయం అందించాయి. 2025-26 ఆర్థిక సంవత్సర లక్ష్యంలో ఇది 77.13%. మెప్మా పరిధిలోని 2,050 గ్రూపులకు రూ. 205 కోట్ల లక్ష్యనికి గాను, 1,127 గ్రూపులకు రూ. 134.63 కోట్లు ఆర్థిక సహాయం అందించినట్లు బ్యాంకర్లు తెలియచేశారు. పీఎం సూర్యఘర్ పథకంలో రుణ తిరస్కరణలు ఎక్కువగా ఉండటంపై బ్యాంకుల ప్రతినిధులను ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రశ్నించారు. పీఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులకు ఇచ్చే రుణ పరిమితి పెంచే విషయం పరిశీలిం చాలని బ్యాంకర్లను ఎంపీ కోరారు. బ్యాంకుల ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని కోరారు. చిన్న, మధ్యతరహా సంస్థలకు రుణ సహాయం అందించేందుకు తెచ్చిన పీఎంఈజిపి వంటి అనేక కేంద్ర పథకాల గురించి ప్రజలకు తెలియని పరిస్థితి ఉందని, వీటిపై ప్రజలకు అవగాహన కలిగేందుకు బ్యాంకుల ప్రతినిధులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు. ఇతర జిల్లాలతో పోల్చితే ఏలూరు జిల్లాలో వ్యవసాయ రుణాలపై వడ్డీ రేటు ఎక్కువగా ఉందని, పంటల బీమా ప్రీమియం కూడా ఎక్కువగా ఉందని, తగ్గించాలని, బ్యాంకర్లకు సూచించిన ఎంపీ, రుణాల వసూళ్లపై కూడా శ్రద్ధ వహించాలని బ్యాంకుల ప్రతినిధులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, కలెక్టర్ వెట్రి సెల్వి, బ్యాకింగ్ రంగ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ అలివేలు మంగ గోదా దేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం చూతము రారండి

**విస్సన్నపేట,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కలగర రామచంద్రపురం గ్రామంలో శ్రీ అలివేలుమంగా గోదా దేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణం భోగి పర్వదినాన జరగనున్నట్లు ఆలయ నిర్వహకులు తెలియజేశారు. కళ్యాణంలో కూర్చునే దంపతులు దేవాలయ కమిటీని సంప్రదించవలసిందిగా వారి విజ్ఞప్తి చేశారు. అదనపు సమాచారం కొరకు 9000908048 సెల్ నెంబర్ ను సంప్రదించవలసినదిగా చెప్పారు.



## మైలవరం, పుల్లూరు సబ్టేషన్ పరిధిలోని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**మైలవరం,జనవరి 9 (వార్తాప్రభ) :** నెలవారీ విద్యుత్ మరమ్మత్తులలో భాగంగా మైలవరం మండలంలోని మైలవరం, పుల్లూరు విద్యుత్ సబ్స్టేషన్ ల పరిధిలోని గ్రామాలలో నేడు అనగా జనవరి 10 వ తేదీ రెండో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.రమేష్ బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు. మైలవరం పొందుగుల, చంద్రుగూడెం ,పుల్లూరు పంచాయతీ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

**చంద్రాల, గణపవరం విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలలో కరెంట్ నిలిపివేత:** నెలవారీ విద్యుత్ మరమ్మత్తులలో భాగంగా మైలవరం మండలంలోని చంద్రాల,గణపవరం విద్యుత్ సబ్స్టేషన్ ల పరిధిలోని గ్రామాలలో నేడు అనగా జనవరి 10 వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి హెచ్ రామ మోహనరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం.ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.చంద్రాల మరియు గణపవరం ఉప కేంద్రాల పరిధిలోని గణపవరం,కీర్తిరాయునిగూడెం,చంద్రాల,టి. గన్నవరం,వెదురుబీడెం, కనిమెర్ల తండా,పోరాట నగర్ గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కరెంట్ ఉండదని ఆయా గ్రామాల ప్రజలు సహకరించవలసిందిగా ఏఈఈ కోరారు.

## స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమంలో పాల్గొన్న డి.ఎల్.డి.ఓ ఏవి రమణ



**విస్సన్నపేట,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నాలుగవ సచివాలయం పరిధిలో స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులను డి ఎల్ డి ఓ ఏవి రమణ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, సచివాలయం అసిస్టెంట్ మాధవ తదితరులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం



**తిరువూరు,జనవరి 9 (వార్తాప్రభ) :** తిరువూరు బస్టాండ్ నుండి సూర్య రెస్టారెంట్ వెళ్లే ప్రధాన రహదారి ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రానికి కూడా అనుసంధానమైన రోడ్డు గత పది సంవత్సరాలుగా రోడ్డు పాడైపోయి పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ఆ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది ఎంతోమంది వాహనాలు గుంటల్లో పడి ప్రమాదాలు జరిగి కాళ్లు చేతులు విరిగి ఆసుపత్రుల పాలై నరకయాతన అనుభవించారు ఎట్టకేలకు బస్టాండ్ నుండి సూరా రెస్టారెంట్ వరకు వెళ్లే రోడ్డుకు రాష్ట్ర ప్రభుత్వం అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రోడ్డుకు నిధులు మంజూరు చేయటంతో ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు పార్టీ నాయకులు కార్యకర్తలు పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలిసి రోడ్డుకు శంకుస్థాపన చేసి రోడ్డు పనులు ప్రారంభించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గంలో పాడైపోయిన రోడ్లు త్వరలోనే పనుల ప్రారంభం జరుగుతాయి త్వరలోనే కోకిలంపాడు రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు తిరువూరు నియోజకవర్గానికి రోడ్ల కొరకు నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రోడ్లు భవనాల శాఖ మంత్రి వర్యులు కృతజ్ఞతలు తెలియజేశారు

## మద్యం సేవించి వాహనం నడుపరాదు: ఎంవిఐ ప్రసాద్



**పెద్దాపురం,జనవరి 9 (వార్తాప్రభ) :** మద్యం సేవించి వాహనం నడుపరాదని పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె.ప్రసాద్ అన్నారు. 37వ జాతీయ రహదారి భద్రతా మాస ఉత్సవాల్లో భాగంగా కాకినాడ జిల్లా ఉప రవాణా కమిషనర్ శ్రీధర్ ఆదేశాల మేరకు రవాణా శాఖ ఆధ్వర్యంలో రవాణా,పోలీసు శాఖ సంయుక్తంగా పెద్దాపురం పట్టణంలో మెయిన్ రోడ్డులో శుక్రవారం రహదారి భద్రత అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్,పెద్దాపురం పట్టణం పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ మౌనిక మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని,కారు లో సీటు బెల్టు ధరించాలని అన్నారు.అనంతరం పెద్దాపురం పట్టణం పోలీసు స్టేషన్ హౌస్ ఆఫీసర్ మౌనిక వాహనదారులకు రహదారి భద్రత పై అవగాహన కల్పింస్తూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని,మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, సూచించారు. అనంతరం వాహన దారులకు రహదారి భద్రతా కరపత్రాలు పంచారు.

# ఉచిత శిక్షణ

**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** ఐటిఐ పూర్తి చేసి పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శనివారం ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఓ. మంజుల దేవి తెలిపారు. ఐటిఐ రెండు సంవత్సరాల కోర్సులో 60 శాతం మార్కులు ఉత్తీర్ణత సాధించిన వారు ఈనెల 5 లోగా ఆధార్, 2 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, 10వ తరగతి జిరాక్స్ సర్టిఫికెట్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు ఈనెల 5 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. శిక్షణ కాలంలో ఎటువంటి భత్యం చెల్లించరని స్పష్టం చేశారు.

# చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు!!

**ప్రాణాపాయం దృష్ట్యా నిఘా పెంపు**
**పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి**
**గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరిక**





**పెద్దపల్లి /గోదావరిఖని: జనవరి 09 (వార్తాప్రభ ప్రతినిధి)**సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత చైనా మాంజా (నైలాన్ తాడు) విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి పట్టణంలోని పలు పతంగి విక్రయ దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పర్యావరణానికి, పక్షులకు అలాగే మానవ ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న చైనా మాంజా వినియోగంపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిషేధం విధించిందని గుర్తు చేశారు. పట్టణంలోని అన్ని ఫ్యాన్సీ, పతంగి దుకాణాలపై నిరంతరం నిఘా ఉంటుందని, రహస్యంగా చైనా మాంజా నిల్వ ఉంచినా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బైక్‌లపై వెళ్లే వాహనదారుల మెడకు ఈ మాంజా చుట్టుకుని ప్రాణాంతక గాయాలవుతున్నాయని, గాలిపటాలు ఎగురవేసే వారు కేవలం నూలు (కాటన్) దారాన్ని మాత్రమే వాడాలని సూచించారు. పిల్లలు గాలిపటాలు కొనేటప్పుడు వారు ఎలాంటి మాంజా వాడుతున్నారో తల్లిదండ్రులు గమనించాలని, పర్యావరణ హితమైన పండుగ జరుపుకోవాలని కోరారు. ఈ తనిఖీల్లో వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో నూతనంగా గెలిచిన బిసి సర్పంచ్ లకు సన్మానం.

**బేరి రామచంద్ర యాదవ్**



**వికారాబాద్ జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వికారాబాద్ జిల్లా పరిగి పూడూరు మండలం లోని కేరవెల్లి నూతన గ్రామ పంచాయతీ సర్పంచ్ గా కాటం రామచంద్రయ్య యాదవ్ గారు ఎన్నికైన సంధర్భంగా తెలంగాణా రాష్ట్ర బీసీ ఐక్యవేదిక భేరీ రాంచందర్ యాదవ్ మాట్లాడుతూ బీసీలు ఎక్కువ శాతం గెలవడం చాలా సంతోషకరం బీసీలలో ఐక్యత తో మున్ముందు ఎంపీటీసీ జడ్పిటిసి కౌన్సిలర్ మున్సిపల్ గ్రేటర్ హైదరాబాద్లో కార్పొరేటర్ గా చైర్మన్ గా పెద్ద ఎత్తున గెలవాలని బీసీ సంఘాలకు పిలుపునిచ్చారు ఘనంగా సన్మానించారు. అలాగే వార్డ్ మెంబర్ భోగవాని రాఘవేందర్ యాదవ్ ను శాలువాతో సత్కరించి ముందు ముందు గొప్ప పదవులు మన యాదవులు దక్కించుకోవాలని కోరారు.బిసిలు ఈ సంవత్సరం జరిగిన స్థానిక ఎన్నికలలో బిసిలు చాలా పదవులు పొందారని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాటం రామచంద్రయ్య యాదవ్ సర్పంచ్ కెరవెల్లిభోగవని రాఘవేందర్ యాదవ్ కేరవెళ్ళి వార్డ్ మెంబర్భేరి ఆంజనేయులు యాదవ్ మిట్టకంకల్ యువజన సంఘంకొజ్జ భాస్కర్ నవాజ్ ఎమ్మెల్యే పి. ఏ.ఇబ్రిహిమ్ సాబ్ భాగం గ భేరీ ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు

## కోడిపందాలు నిర్వహించటం చట్టరీత్యా నేరం.

**వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం - తాహసిల్దార్ శాంతి లక్ష్మి.**



**పెనుగంచిప్రోలు, జనవరి 9( వార్త 0 ప్రభ)** మండల కేంద్రం అయినపె ను గంచిప్రోలు గ్రామంలోని శుక్రవారం స్థానిక తహ సీల్దార్ కార్యాలయంలో ఒక పత్రిక ప్రకటన విడుదల చేసి అనంతరం గ్రామంలో కోడిపందాలకు సంబంధించి బ్యానర్ పట్టుకొని ర్యాలీగా ఉన్నత అధికారులతో తహసీల్దార్ శాంతి లక్ష్మ, ఎంపీడీవో శ్రీనివాస్ మరియు గ్రామ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మండల తాసిల్దార్ శాంతి లక్ష్మ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగే కోడి పందాలు నిర్వహించకూడదనే సదుద్దేశంతో శుక్రవారం పెనుగంచిప్రోలు మండలంలోని రెవిన్యూ కార్యలయంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసారు.కోడి పందాలు జంతు క్రూరత్వ నిరోధక చట్టానికి విరుద్ధమని, అలాగే న్యాయస్థానాల ఆదేశాలకు విరుద్ధంగా జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ స్థాయిలో ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సున్నిత ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేసి, కోడి పందాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపడతామన్నారు. అనంతరం కోడి పందాలు నిర్వహించడానికి, పాల్గొనడానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్యాం కుమార్, కాకాని పద్మ వీఆర్వోలు వీఆర్ఏలు రెవిన్యూ సిబ్బంది గ్రామపంచాయతీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

● బాచుపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ● కొలన్ హనుమంత్ రెడ్డి చొరవతో ఐదుగురు లబ్ధిదారులకు ఆర్థిక భరోసా ● శ్రీధర్ బాబు సహకారంతో నిధుల మంజూరు





**కుత్బుల్లాపూర్/బాచుపల్లి, జనవరి 9, (వార్తాప్రభ) :**అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఒక వరమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఐదుగురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన స్వయంగా అందజేశారు. **త్వరితగతిన స్పందన:** గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు, ఖర్చులకు స్థోమత లేక హనుమంత్ రెడ్డి ని ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఆయన, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ప్రభుత్వం నుండి ఈ నిధులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ఆపదలో ఉన్న వారు సీఎంఆర్ఎఫ్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఆయన ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధి రంగంలో రాణించాలి

● కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కె.ఎం. ప్రతాప్ ● సుభాష్ నగర్‌లో 'భవాని మొబైల్స్ షాపును ప్రారంభించిన ప్రతాప్ ● వ్యాపార రంగంలో ఎదిగేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది



**కుత్బుల్లాపూర్, జనవరి 9, (వార్తాప్రభ) :** యువత కేవలం ప్రభుత్వ ఉద్యోగాల కోసమే వేచి చూడకుండా, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కె.ఎం. ప్రతాప్ పిలుపునిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సుభాష్ నగర్ ఫేజ్-1, శివాలయం రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'భవాని మొబైల్స్ షాపును ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. యువతలో నైపుణ్యం మెండుగా ఉందని, దానిని వ్యాపార రంగంలో పెట్టుబడిగా పెట్టాలని సూచించారు. స్వయం ఉపాధిని నెలకొల్పుకోవాలనుకునే యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. షాపు నిర్వాహకులు నరేందర్, సాయిలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుభాష్ నగర్ ఫేజ్-1 సంక్షేమ సంఘం అధ్యక్షులు బిజిలి కృష్ణ, అయోధ్య నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు మాద రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పురుషోత్తం, ఊరడి మల్లికార్జున్, జిట్టా బలవంత రెడ్డి, పోతరాజ్ మహేందర్ కుమార్, భవాని మొబైల్స్ ప్రొప్రైటర్స్ నరేందర్, సాయి మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొమ్మారెడ్డి హైస్కూల్ నందు అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



**కృత్తివెన్ను జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొమ్మారెడ్డి పాఠశాలలో శుక్రవారం నాడు ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొమ్మారెడ్డి స్కూల్ పూర్వ విద్యార్థి బంటుమిల్లి మండల తహసిల్దార్ కాగిత పూర్ణ చంద్రరావు సతీసమేతంగా విచ్చేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ బత్తుల శంకర్ , నాగేశ్వరరావు పేట సర్పంచ్ తాతా మహాలక్ష్మ , విశ్రాంత పాత్రికేయులు యు.పి.ఆర్. విఠల్ పాల్గొన్నారు ఈ కార్యక్రమం ముందుగా చక్కని భక్తి గేయంతో ప్రారంభమైనది. తదనంతరం అతిధులచే భోగిమంటలను వెలిగించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. బొమ్మల కొలువును ముఖ్య అతిధి కాగిత పూర్ణచంద్రరావు ప్రారంభించారు. అనంతరం కాగిత పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఇలాంటి మన సంస్కృతి, సంప్రదాయాలు తెలియచేసే ఈ కార్యక్రమశీలో పాల్గొనడం తనకు చాలా సంతోషాన్ని కలిగించిందని కొమ్మారెడ్డి స్కూల్ లో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.విద్యార్థులు జీవితంలో మంచి లక్ష్యలను ఏర్పరుచుకుని వాటిని సాధించాలని పేర్కొన్నారు. అందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.రెవెన్యూ ఇన్స్పెక్టర్ ( ఆర్ ఐ ) బత్తుల శంకర్ మాట్లాడుతూ కొమ్మారెడ్డి విద్యాసంస్థ ఈ మారుమూల ప్రాంతంలో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి చాలా గొప్పదని కొనియాడారు. అలాగే విద్యార్థులు సెల్ ఫోన్ లతో సమయాన్ని వృధా చేయకుండా విద్య పై మరింత శ్రద్ధ చూపాలని విద్యార్థులకు సందేశాన్ని ఇచ్చారు. తదనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులలో మన సంప్రదాయాల పట్ల ఆసక్తి , అవగాహన కలగాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ పండుగ సందర్భంగా నిర్వహించిన తెలుగమ్మాయి, తెలుగబ్బాయి పోటిలలో అన్ని తరగతుల నుండి 683 మంది విద్యార్థిని, విద్యార్థులు మొదటి రౌండ్ లో ఇంతకు ముందు పాల్గొనడం, వారిలో ఎంపిక చేసిన 214 మంది ఈ రోజు ఫైనల్ లో పాల్గొనడం సంస్కృతి, సంప్రదాయాల పట్ల విద్యార్థులలో పెరుగుతున్న శ్రద్ధాసక్తిని తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ పండుగ మూడు రోజుల యొక్క విశిష్టతను ఉపాధ్యాయులు వి.సాంబ శివ రాజు మరియు సి.హెచ్ రేవతి విద్యార్థులకు తెలియచేశారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు సంక్రాంతి గేయాలకు ప్రదర్శించిన వివిధ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. మరిముఖ్యంగా బి. సాత్విక ఉ 4 వ తరగతి నడుము చుట్టూ రింగ్ తిప్పుతూ చేసిన డ్యాన్సు అందరిని ఆకట్టుకుంది. అలాగే 10 వ తరగతి విద్యార్థులు యం. వెంకట్, యం. ఉదయ్ కార్తీక్, జి. మోహన్ చేసిన కర్రసాము విన్యాసాలు అందరిని అలరించాయి. వీరందరికీ స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మెమెంటోలను అందించారు. ఈ కార్యక్రమానికి హరిదాసు, గంగిరెద్దుల ఆట ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ పండుగ సందర్భంగా విద్యార్థులలో సీనియర్స్ (8 నుండి 10 తరగతులు), జూనియర్స్ (6,7 తరగతులు) విభాగాలలో మరియు టీచర్స్ కు కూడా రంగవల్లుల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి మరియు తెలుగమ్మాయి, తెలుగబ్బాయి పోటీలలో గెలుపొందిన వారికి మెమెంటోలను, కిరీటాలను బహుకరించారు, 7000 రూపాయల నగదును అందరికి సమానంగా పంచారు. తెలుగమ్మాయి, తెలుగబ్బాయి పోటీలలో విజేతలు విభాగాల వారీగా :- సబ్ జూనియర్స్ (1 , 2 తరగతులు) విజేతలు :- బాలికల విభాగంలో ప్రథమ స్థానం ఉ జి. కాత్యాయనీ (1 వ తరగతి ద్వితీయ స్థానం ఉ ఆర్.జువాన (2 వ తరగతి), యస్.కె. అతీఫా (2 వ తరగతి) బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఉ పి. హేమ చంద్ర (2 వ తరగతి) ద్వితీయ స్థానం ఉ అర్. గగన్ (2 వ తరగతి)జూనియర్స్ (3 నుండి 5 వ తరగతులు) విజేతలు :-

బాలికల విభాగంలో ప్రథమ స్థానం ఉ ఎ. రోషిణి (3 వ తరగతి) ద్వితీయ స్థానం ఉ సనా ఫాతిమా (4 వ తరగతి) బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఉ యన్. ఆనంద్ బాబు (4 వ తరగతి) ద్వితీయ స్థానం ఉ యన్. కార్తీక్ (4 వ తరగతి)

**సబ్ సీనియర్స్ (6,7 తరగతులు) విజేతలు :-** బాలికల విభాగంలో ప్రథమ స్థానం ఉ యం.పావనేశ్వరి (7 వ తరగతి) ద్వితీయ స్థానం ఉ టి. వైష్ణవి (7 వ తరగతి) బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఉ కె. అభిరాం (7 వ తరగతి)

ద్వితీయ స్థానం ఉ వి. తనుష్ కుమార్ (7 వ తరగతి)

**సీనియర్స్ (8 నుండి 10 తరగతులు) విజేతలు :-** బాలికల విభాగంలో ప్రథమ స్థానం ఉ నందిని ప్రియాంక (9 వ తరగతి) ద్వితీయ స్థానం ఉ టి. పావని (10 వ తరగతి) బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఉ యన్.కె.వి. ప్రవీణ్ (8 వ తరగతి) ద్వితీయ స్థానం ఉ యన్. చత్రిష్ వర్మ (8 వ తరగతి) ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ , స్కూల్ సెక్రెటరీ మరియు కరెస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ , కొమ్మారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కొమ్మారెడ్డి చైతన్య, డైరెక్టర్ ఉ వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి , స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎన్. శ్రీనివాసరావు , పుర ప్రముఖులు, తల్లిదండ్రులు ,ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, భోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# శిక్షణతో భద్రత సాంకేతికత ద్వారా పరివర్తన.



**నూజివీడు, జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రాంతీయ రవాణా యూనిట్ కార్యాలయంలో 37వ జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాల్ల భాగంగా " శిక్షణతో భద్రత - సాంకేతికత ద్వారా పరివర్తన " అనే స్లోగన్ తో ఈ కార్యక్రమం ప్రారంభించబడినది. నూజివీడు ప్రాంతీయ రవాణా యూనిట్ కార్యాలయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్ బాలెందు శేఖర్ మరియు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ టీ వీ కృష్ణవేణి, ఎల్ అన్నపూర్ణ ఈరోజు కార్యక్రమంలో భాగంగా నూజివీడు పట్టణంలో సాయి ప్రణీత హై స్కూల్ ఆవరణలో రోడ్డు భద్రత మాస ఉత్సవాల గురించి తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ సిబ్బంది మరియు సాయి ప్రణీత హై స్కూల్ యాజమాన్యం, ప్రిన్సిపాల్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రోడ్డు భద్రత కార్యక్రమం ఉద్దేశించి పిల్లలకు రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ, ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, రోడ్డు దాటేటప్పుడు ట్రాఫిక్ నిబంధనకు అనుగుణంగా వారు సూచించిన సైన్ బోర్డు లను గమనిస్తూ భద్రత విషయంలో జాగ్రత్త తీసుకోవాలని, ఈ రోడ్డు భద్రత విషయాలను విద్యార్థి దశ నుంచి తెలుసుకొనటం వలన ప్రమాదాలను అరికట్టవచ్చని, భావితరాలకు ప్రమాదరహిత రోడ్లుగా చూడవచ్చని ఇది మన అందరి బాధ్యతగా రహదారి భద్రత గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి విద్యార్థి ఇక్కడ విన్న మంచి మాటలను తమ తల్లిదండ్రులకు తెలియజేసి వారు కూడా హెల్మెట్ పెట్టుకొని డ్రైవింగ్ చేయించాలని, రోడ్డు భద్రత నియమాలు గురించి తెలియ చెప్పాలని, కోరుచున్నాము. ముఖ్యంగా స్కూల్ యాజమాన్యం వారు స్కూల్ బస్సులు నడిపే అనుభవం కలిగిన డ్రైవర్లు నియమించాలని, వారు రవాణా శాఖ ద్వారా పొందిన లైసెన్స్ ను కలిగి ఉండాలని, స్కూల్ బస్సు డ్రైవర్ లందరూ డ్రైవింగ్ చేసే సమయంలో మద్యం సేవించరాదని, బస్సులు ఫిట్నెస్ అన్ని సక్రమంగా ఉండే విధంగా స్కూల్ యాజమాన్యం పర్యవేక్షించాలని పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులతో పాటు యాజమాన్యం వారు కూడా బాధ్యతాయంగా గమనిస్తూఉండాలని, ఈ రహదారి భద్రత కార్యక్రమమును విజయవంతం చేయాలని ఇక్కడికి విచ్చేసిన పిల్లలు మరియు పేరెంట్స్,స్కూల్ సిబ్బందని కోరడమైనది.

# జాతీయ రహదారిపై బిజెపి శ్రేణుల నిరసన



**కూకట్ పల్లి, జనవరి 9(వార్తాప్రభ):**భారతీయ జనతా పార్టీ వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ వంశీ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాధవరం కాంతారావు మాట్లాడుతూ వివేకానంద నగర్ జాతీయ రహదారి ప్రక్కన సర్వీస్ రోడ్డు నిర్మాణ క్రమంలో గత మూడు నెలల నుండి జాప్యం జరుగుతున్నందున గతంలో జిహెచ్ఎంసి అధికారులకు మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ని కలిసి వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. వారు స్పందించి వెంటనే పనులు పూర్తి చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కానీ ప్రభుత్వ అధికారులు ఇచ్చిన హామీ దున్నపోతు పైన కురిసిన వర్షం లాగా వారి హామీలు కూడా అదే విధంగా తయారయ్యాయి.రోడ్డు వేయకపోవడంతో వాహనదారులకు పాదసారులకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ మరియు చెన్నై షాపింగ్ మాల్స్ సర్వీస్ రోడ్డును పూర్తిగా ఆక్రమించి వారి వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలిపివేయడం వలన వాహనదారులు ఆక్సిడెంట్లకు గురి అవుతున్నారు.ఇప్పటికైనా దీనిపై స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వారు హెచ్చరించారు.లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ధర్నా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అధికారులను హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# "సాయి హర్ష బిల్డర్స్" డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**శేరిలింగంపల్లి,జనవరి 9 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ ఏ బ్లాక్ కాలనీ చెందిన సాయి హర్ష బిల్డర్స్ అధినేత బలరామ్ యాదవ్ ఆంగ్ల నూతన సంవత్సర (2026) డైరీలు మరియు క్యాలెండర్ ను ఆవిష్కరించిన పిఎసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ కార్యక్రమంలో నాగరాజు యాదవ్, రమేష్ యాదవ్,కృష్ణ యాదవ్,యాదిరెడ్డి,అవధిష్, నారాయణ ,హనుమంత రెడ్డి, మల్లేష్ యాదవ్,టి వెంకటేష్, ఆంజనేయులు,రేపల్లె అశోక్, జైపాల్ రెడ్డి,నరసింహారెడ్డి, సందీప్,పుండరీకం,సన్నీ యాదవ్,వీరన్న పగిడి,శివ సత్యనారాయణ తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**నూజివీడు: జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నూజివీడు మండలంలోని అన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శు క్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గులు పోటీలు, పతంగులు ఎగరవేయడం, తదితర పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలకు ఉపాధ్యాయులు బహుమతులు అందించారు.

## అన్న ధానం కు10 వేల116/రూ. విరాళం



**పెనుగంచిప్రోలు, జనవరి 9( వార్త ప్రభ)** శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో జరుగు అన్నదానం కు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరం శ్రీరామచంద్ర నగర్ వాస్తవ్యులు యలమంచిలి వెంకట రామ ప్రతాప్, ప్రియాంక దంపతులు వారి కుమార్తె బ్రాహ్మణి పేరుపై శ్రీ అమ్మవారినిత్య అన్నదాన పథకములకు 10,116/ రూపాయలు విరాళముగా ఆలయ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్ కు అందజేశారు వారికి ఆలయ అర్చకులు వేద పండితుడిచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు..

## స్కూల్ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరి

**ఆర్టీవో ఎం పద్మావతి**



**నందిగామ జనవరి 9 (వార్త ప్రభ)** జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు (01.01.2026 నుండి 31.01.2026 వరకు) ససందర్భంగావేగం తగ్గించండి – ప్రాణాలు కాపాడండి! మన పిల్లల భద్రత ఉ మన బాధ్యత! నినాదాలతో ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం, నందిగామ నందు స్కూల్ బస్ డ్రైవర్లకు అవగాహన సదస్సును ఆర్ టి ఓ ఎం పద్మావతి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్టీఓ ఎం. పద్మావతి మాట్లాడుతూస్కూల్ బస్సులు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా ఉండాలి, అలాగే డ్రైవర్ మరియు అటెండర్ యూనిఫాం ధరించాలి అని తెలిపారు. అదేవిధంగా, అత్యవసర ద్వారం సక్రమంగా ఉండేలా చూసుకోవాలి అని అన్నారు.తదుపరి మోటార్ వాహన తనిఖీ అధికారి ఎం. పూర్ణిమ మాట్లాడుతూ, స్కూల్ బస్సులో ఎటువంటి పరిస్థితుల్లోనూ పరిమితిని మించి విద్యార్థులను ఎక్కించరాదని స్పష్టం చేశారు. డ్రైవర్‌కు కనీసం 5 సంవత్సరాల డ్రైవింగ్ అనుభవం ఉండాలి అని పేర్కొన్నారు. బస్సులో విద్యార్థుల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి అని, అలాగే డిఫెన్సివ్ డ్రైవింగ్ పాటించాలి అని సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో తనపరిపాలన అధికారి బి ఎస్ కే ప్రభాకర లింగం గారు , శ్రీ రామ్ డ్రైవింగ్ స్కూల్ ప్రెసిడెంట్ సి హెచ్ రామ రావు, నారాయణ టెక్నో స్కూల్ బస్ డ్రైవరులు, కాకతీయ అపోలో స్కూల్ బస్ డ్రైవరులు, శ్రీవిద్య స్కూల్ బస్ డ్రైవరులు, చైతన్య స్కూల్ బస్ డ్రైవరులు, అక్షర స్కూల్ బస్ డ్రైవరులు, ఎం ఐ సి కాలేజీ బస్ డ్రైవరులు ,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## ఏపీలో అచ్చంగా మహిళల కోసం 25 వేల కోట్లు!

ఏపీలో మహిళల సంఖ్య పెరుగుతోంది. వాస్తవానికి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోనూ మహిళల సంఖ్య పెరుగుతున్నట్టు గణాంక శాఖ చెబుతోంది. ఈ నేపథ్యంలో మహిళల స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మెరుగు పరిచేందుకు అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నాయి. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం తాజాగా మహిళల కోసం 25 వేల కోట్ల రూపాయల నిధిని ప్రకటించింది. ఈ నిధులను పూర్తిగా మహిళా సాధికారత, వారి అభివృద్ధి, ఉపాధి కోసం వెచ్చించనున్నారు. ఈ మొత్తం నుంచి మహిళలు రుణాలు తీసుకుని.. స్వల్ప వడ్డీకే అబివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. తద్వారా.. ఆర్థికంగా వారు ఎదిగేందుకు ప్రభుత్వం సాయం చేయనుంది. గరిష్ఠంగా మహిళల కు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల వరకు రుణాలను మంజూరు చేస్తారు. దీనికి ప్రభుత్వమే హామీ ఉండనుంది. ఈ రుణాలను కూడా.. ఆన్‌లైన్‌లోనే పొందే విధంగా ఏర్పాటు చేయనున్నారు ముఖ్యంగా ఉమ్మడి రాష్ట్రంలో మహిళా సంఘాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు వారికి మరింత దన్నుగా ఉండేందుకు.. వారికి ఆర్థిక సాయం చేసేందుకు రూ.25 వేల కోట్ల నిధిని ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ సంఘాలను ప్రతిగ్రామానికి.. వార్డుకు కూడా విస్తరించనున్నారు. వారు చేసే ఉత్పత్తులను ఇక నుంచి ప్రభుత్వం ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించనుంది. అదేవిధంగా నైపుణ్య శిక్షణలో భాగంగా మహిళలకు కార్పొరేట్ సంస్థలతో శిక్షణ ఇప్పించనున్నారు. తద్వారా.. వారికి మార్కెటింగ్ నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.13 కోట్ల మంది మహిళా సంఘ సభ్యులు ఉన్నారు. వీరిలో కొద్దిగా చదువుకున్న వారిని ఎంపిక చేసి.. వారికి.. నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ వంటి మెళకువలు నేర్పించనున్నారు. తద్వారా వారి వ్యాపారాన్ని వారే అభివృద్ధి చేసుకోవడం, ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే విధానాలను నేర్పించనున్నారు.

## దోమల వల్ల కలిగే వ్యాధుల నివారణ కొరకు ఫ్రైడే డ్రై డే





**విజయవాడ పశ్చిమ జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు ఫ్రైడే ఫ్రైడే నిర్వాహణ తో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం అయోధ్యనగర్, కొత్త ఆర్ఆర్ పేట, దర్శిపేట మరియు లబ్బీపేట ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు విఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే, డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## ఎంతైనా అవసరము




కాసింత మంచితనము
జీవితాన గొప్పతనము
ఉంటే కదా మంచిది
మాటల్లో చక్కదనము
విలువైన త్యాగగుణము
అన్నిటా చురుకుదనము
ఉంటే కదా మంచిది
బ్రతుకున హుందాదనము
హృదయాన తెల్లదనము
మాటల్లో మృదుత్వము
ఉంటే కదా మంచిది
చిందితే కరుణరసము
ఘనమైన క్షమాగుణము
ఎదిగేందుకు శ్రమదానము
ఉంటే కదా మంచిది
శ్రేష్ఠమైన సాత్వికము

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు సెల్:9966 414580

# "అందరూ బాగా చదవాలి - అందరూ బాగా ఎదగాలి"





**విజయవాడ పశ్చిమ జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 53 వ డివిజనుల్లో వున్న మౌలానా ఆజా ద్ ఉర్దూ హై స్కూల్, ఇస్లాంపేట నందు పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం శుక్రవారం నిర్వహించారు.రేపటి నుంచి ప్రభుత్వ ఆదేశాల అనుసరించి పాఠశాలకు సెలవులు ప్రకటించటం తో ఈ సెలవుల్లో విద్యార్థులు ఏ విధంగా చదవాలి అనే అంశాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. పిల్లల ప్రవర్తన ను, చదువుతున్న విధానాన్ని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని హెచ్ఎం శ్రీమతి కళ్యాణి తెలియజేశారు. ఈ తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు కూడా మాట్లాడుతూచదువు యొక్క ఆవశ్యకతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రతిరోజు శ్రమించాలి అని,మన జీవన విధానాన్ని, మన ఆర్థిక స్థితిగతు లను మార్చేది క్రమశిక్షణతో కూడిన చదువు మాత్రమే అని సందేశం అందించారు. విద్యార్థులందరితో సబ్జెక్టు ఉపాధ్యాయులందరూ విద్యార్థుల విద్యా ప్రగతి గురించి వివరించడం జరిగింది.పాఠశాల నుండి తెలుగు ఉపాధ్యాయులు జె. రామకృష్ణ గత రెండు నెలల నుంచి నిర్వహిస్తున్న "గృహ సందర్శన" అనే కార్యక్రమం అందిస్తున్న చైతన్యం, వస్తున్నా మార్పు గురించి, దాని ఆవశ్యకత గురించి తల్లిదండ్రులు వివరించడం జరిగింది. ప్రతి విద్యార్థి 100 రోజుల యాక్షన్ ప్లాన్ క్రమం తప్పకుశీడా చదివి మంచి పలితాలు అందిస్తామని తల్లిదండ్రులకు హామీ ఇవ్వటం జరిగింది. చివరిగా సంక్రాతి పండుగ సందర్భంగా విద్యార్థులందరికి గాలిపటాలు, అరిసెలు అందించటం జరిగింది.

# ప్రపంచానికి తెలుగువారిచ్చిన విలువైన బహుమతి కొండపల్లి బొమ్మలు

***తెలుగు వారి సంస్కృతీ, సాంప్రదాయానికి ప్రతీక కొండపల్లి బొమ్మలు***
***యూరోపియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్***





**ఇబ్రహీంపట్నం, జనవరి 09(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రాచీన చరిత్ర, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహితమైన తయారీ విధానం అంతర్జాతీయ స్థాయిలో కొండపల్లి హస్తకళల పేరు ప్రఖ్యాతలకు ముఖ్య కారణమని యూరోపియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్ తెలిపారు.తెలుగువారి కళా వైభవానికి నిలువుటద్దం, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి హస్తకళలను శుక్రవారం కొండపల్లిలోని ఏపీ టూరిజం శాఖ నిర్వహిస్తున్న కొండపల్లి ఎక్స్పీరియన్స్ సెంటర్ ను యూరోపియన్ యూనియన్ అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి. లక్ష్మిశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా తో కలిసి పరిశీలించారు. సాంప్రదాయ హారతి, పూల దండలతో రాయబారిని తిలకందిద్ది స్వాగతించగా, వీధి మొత్తం సప్తవర్ణ ముగ్గులతో అలంకరించబడిన పండుగ వాతావరణంగా మారింది. ఈయూ రాయబారి ఎక్స్ పీరియన్స్ సెంటర్ ను సందర్శించి అందులో బొమ్మల తయారీ విధానాన్ని, వాటి ధరలను కళాకారుల నుండి అడిగి తెలుసుకున్నారు. సాదాసీదా పొనికి కర్రతో కళాకారుల చేతుల్లో ప్రాణం పోసుకుని, అద్భుత శిల్పాలుగా మారే ప్రక్రియను చూసి ఆయన ముగ్ధులయ్యారు. కేవలం బొమ్మలను బొమ్మలుగానే కాకుండా, ఆ బొమ్మల వెనుక ఉన్న శతాబ్దాల నాటి చరిత్రను, హస్తకళాకారుల మనోభావాలను, వారి అంకితభావాన్ని అంబాసిడర్ కొనియాడారు. ప్రతి బొమ్మ ఒక కథ చెబుతోంది, ప్రతి రంగు ఒక సంస్కృతిని ప్రతిబింబిస్తోంది అని ఆయన ఈ సందర్భంగా వ్యాఖ్యానించటం ఆయనను ఈ పర్యటన ఎంత హత్తుకుందో చెప్పకనే చెపుతుంది. ఐరోపా దేశాలకు, భారతీయ గ్రామీణ కళలకు ముఖ్యంగా తెలుగువారి సాంస్కృతిక వైభవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రోత్సాహం ఎంతో అద్భుతంగా ఉందనటానికి ఈ పర్యటన ఒక గొప్ప సాంస్కృతిక వారధిలా నిలుస్తుందని, హస్తకళాకారుల నైపుణ్యం ప్రపంచ స్థాయి ప్రశంసలకు అర్హమని ఆయన పేర్కొన్నారు. స్థానిక సభ్యులు రమణరావు, తదితరలు రాయబారికి కొండపల్లి బొమ్మలను బహుకరించారు.

**కొండపల్లిలో అంబాసిడర్ హెర్వే డెల్ఫిన్ మాటల్లో.......**కొండపల్లి కళాకారుల వేళ్ల కొనల్లో అద్భుతమైన మ్యాజిక్ ఉంది. ఒక సామాన్యమైన చెక్క ముక్కను అపురూపమైన కళాఖండంగా మార్చడం నిజంగా అద్భుతం. ఈ వారసత్వాన్ని కాపాడుతున్న కళాకారులకు నా అభినందనలు. ఈ పర్యటనలో ఆయన కళాకారులతో ముచ్చటించి, బొమ్మల తయారీలోని మెళకువలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కొండపల్లి ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన ఈ సందర్శన, స్థానిక కళాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఆంధ్రప్రదేశ్‌లోని అత్యంత శక్తివంతమైన జీవన చేతిపనుల సంప్రదాయాలలో ఒకటైన కొండపల్లి హెరిటేజ్ స్ట్రీట్, ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను సందర్శించడంతో, కొండపల్లిలోని చారిత్రాత్మక వారసత్వ వీధి రంగులు, చేతిపనులు మరియు వేడుకలతో సజీవంగా మారింది.

# సమస్యల తక్షణ పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

***మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్***
***కొండపల్లి ప్రజదర్బారులో 241 అర్జీలు అందజేత***





**ఇబ్రహీంపట్నం, జనవరి 09 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యమని,కొండపల్లి మున్సిపాలిటీ ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కొండపల్లిలో శుక్రవారం ప్రజదర్బారు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. మొత్తం 241 మంది అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా ఇళ్లస్థలాలు, ఇళ్లపట్టాలను ఇవ్వాలని, రహదారులను అభివృద్ధి చేయాలని, కొండపల్లి మున్సిపాలిటీలో మార్కెట్ సెంటర్లో మరుగుదొడ్ల నిర్మాణం కొరకు, హిందూ స్మశాన వాటిక అభివృద్ధి కొరకు, కొండపల్లి జిల్లా పరిషత్ బాలురు పాఠశాల అభివృద్ధి కొరకు, ఐటిఐ కళాశాల ఏర్పాటు చేయుట గురించి, ఎన్టిటిపిఎస్ కాలుష్య నివారణ కొరకు, కిల్లా డ్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణం గురించి, పైపులైన్ల ఏర్పాటు నీటి కుళాయిలు, వీధిదీపాల ఏర్పాటు డ్రైనేజీ సమస్యలు పరిష్కారం కోసం, పోలీసు శాఖకు సంబంధించిన అర్జీలు స్వీకరించారు.ఆయా సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ వెంటనే పరిష్కారం అయ్యే వాటిని గుర్తించి వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజదర్బారు నిర్వహణ ప్రజాస్వామ్య పాలనకు నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా వారంలో ఒక రోజు ఒక్కో ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించి, అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అన్నారు. ఒకవేళ వారి సమస్య పరిష్కారం కాకపోతే దానికి గల కారణాలు కూడా వారికి తెలియజేయాలని అన్నారు. ఇళ్లస్థలాలకు సంభందించి ఇప్పటికే కొండపల్లి మున్సిపాలిటీలో చాలామందికి ఇళ్లస్థలాలను పంపిణీ చేశామని, ఇంకా అర్హత కల వారు ఉంటే, సమగ్రంగా విచారించి,ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇదిలా ఉండగా సొసైటీ ఉద్యోగులు కూడా వారి సమస్యలను పరిష్కరించాలని, తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్,జంపాల సీతారామయ్య, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం సమక్షంలో ప్రత్యేక తపాలా కవరు విడుదల



**కాకినాడ, జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో నిర్వహించిన జాతీయస్థాయి మిష్టి సదస్సుసందర్భంగా విజయవాడ లెమన్ ట్రీ హెరీటల్లో ప్రత్యేక తపాలా కవరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పోస్టుమాస్టర్ జనరల్ వి.ఎస్. జయశంకర్ విడుదల చేశారు. తొలి ప్రత్యేక కవరును రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు అందచేసినట్టు కాకినాడ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె. కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ ఛీఫ్ కన్జర్వేటర్ పి.వి.చలపతి, రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే పాల్గొన్నారు. మిష్టి అంశంపై నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడుకు చెందిన అనేకమంది ప్రతినిధులు పాల్గొన్నారు. మిష్టి అనేది భారతప్రభుత్వం 2023లో ప్రారంభించిన కార్యక్రమం. ఇది సముదాయ భాగస్వామ్యంలో మాన్ గ్రూవ్ అటవీ విస్తీర్ణం పెంపొందించడంతోపాటు తీరప్రాంతాల స్థిరత్వాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఉంటుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక కవరు మనదేశ తీరప్రాంతాల్లో సంరక్షణ, సుస్థిర జీవనదుల అభివృద్ధిలో పథకం పోషిస్తున్న కీలకపాత్రను ప్రతిబింబిస్తుందని తెలిపారు.

# దివ్యాంగ కుటుంబానికి అండగా మైత్రి ఫౌండేషన్



**మచిలీపట్నం జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి).**మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో,మచిలీపట్నం ఉ గొడుగు పేట, తమ్మన వారివీధి వాస్తవ్యులువంకా రమేష్ గారు (దివ్యాంగులు) కుటుంబానికిమానవతా దృక్పథంతో సేవా కార్యక్రమం నిర్వహించబడింది.గత కొద్ది సంవత్సరాలుగా మూలశంఖ (గ్రేడ్ 4) వ్యాధితో బాధపడుతూ, విజయవాడ హరిణి గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం బెడ్ రెస్ట్‌లో ఉన్నారు. దివ్యాంగుల పెన్షన్ మీదే కుటుంబం ఆధారపడి ఉండగా, వారి తండ్రి మంచానికి పరిమితమై ఉండటం,భార్య రోల్డ్ గోల్డ్ పనులు చేసుకుంటూ మొత్తం కుటుంబ బాధ్యతలను మోయాల్సిన పరిస్థితి నెలకొంది.ఈ కుటుంబ పరిస్థితిని గమనించిన మచిలీపట్నం వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షులు నాగబాబు, ఈ అంశాన్ని మైత్రి ఫౌండేషన్ దృష్టికి తీసుకువచ్చారు. వారి అభ్యర్థన మేరకు,మైత్రి బృంద సభ్యుల ఆమోదంతో, కుటుంబానికి రూ.6,000 విలువ చేసే రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులువితరణ చేయడం జరిగింది. ఈ సేవా కార్యక్రమంలోమైత్రి ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు అధ్యక్షులువేణు కుమార్,ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్ ,కార్యదర్శి దైవపు రాధాకృష్ణ , అనిల్ ,రమాదేవి, మాణిక్యాలరావు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తోటకూర రామారావు వితరణ తో బోరు ఏర్పాటు



**ఇబ్రహీంపట్నం, జనవరి 09(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లిలోని హజరత్ సయ్యద్ షాబుఖారి నిత్య అన్నదాన లంగరా?నాలో నీటి సమస్యను తెలుసుకొని పరిటాల గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తోటకూర రామారావు బోరు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు. శుక్రవారం షాబుఖారి అన్నదాన లంగర్ ఖానా లో స్వయంగా అన్నదానం చేశారు. అనంతరం బోర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అజ్మీర్ దర్గా పీఠాధిపతులు, సయ్యద్ సుల్తాన్ హసన్ చిస్తి బాబా,సూఫీ అల్తాఫ్ బాబా ప్రత్యేక ప్రార్థనలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అన్నదానం చేస్తున్న అల్తాఫ్ బాబా సేవలు ఎంతో అభినందనీయమని, ఇలాంటి మంచి కార్యక్రమానికి తన వంతు సహాయం అందించాలని బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనకు మొదటి నుండి ముస్లిం సోదరులతో సాన్నిహిత్యం ఉందని, అన్నదమ్ముల వలె ఆప్యాయత అందరూ ఉన్నమని తెలిపారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే మొబైల్ కోర్టులో జరిమాన



**విజయవాడ పశ్చిమ జనవరి 9 :(వార్త ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ ఆదేశాలతో రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి శుక్రవారం నిర్వహించే మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్ బాబు, శుక్రవారం ఉదయం సర్కిల్-3 కార్యాలయం పటమట నందు సర్కిల్-3 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన 22 కేసులపై విచారణ జరిపి వారికి రూ..5,410/- రూపాయలు జరిమానా విధించారు.మరోసారి ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఈ సందర్భంగా రోడ్లపై మాట్లాడుతూ చెత్త వేసిన మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలని మొబైల్ కోర్ట్ జడ్జి హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్స్ రమేష్ బాబు, బాలాజీ శ్రీనివాస మూర్తి , శానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గన్నవరం, జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును.. రేపు అనగా (10-01-26) శనివారం ఉదయం 09:00 గంటల నుంచి మధ్యాహ్నం 01:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్న అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్పోర్ట్ సిటీ, స్లేట్ స్కూల్, గొల్లనపల్లి, బిబి గూడెం, ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును. కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు,పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

# ట్రాఫిక్ పై అవగాహన సెమినార్ నిర్వహించిన ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు






**గుంటూరు జనవరి 9 (వార్తాప్రభ ప్రతినిధి):-**జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గుంటూరు అర్బన్ (ట్రాఫిక్) డి.యస్.పి బి.అజ్రీశ్రీ.శ్రీనివాసరావు సూచిన ప్రకారం ఈస్ట్ ట్రాఫిక్ సి.ఐ ఆకుల అశోక్ కుమార్ పర్యవేక్షణలో ఈస్ట్ ట్రాఫిక్ పోలీసుల నేతృత్వంలో శుక్రవారం నాడు నిత్యం గుంటూరు బస్టాండ్ లో కొనసాగుతున్న ట్రాఫిక్ పై అవగాహన సదస్సును ఆటోరిక్ష డ్రైవర్లతో పాటు ఆయా ద్విచక్ర వాహన దారులకు తగు అజ్రీశ్రీసూచనలను తీసుకోవాల్సిన జాగ్రత్తలను బహిర్గతంగా నిర్వహించారు.ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ నీ విధిగా పాటించాలని , మాదక ద్రవ్యాలు సేవించి వాహనాలు నడిపి పోలీసులకు పట్టుబడి కటకటాలు పాలైయి మీ ఉజ్వల భవిష్యత్తును రోడ్డు పాల్జేసుకోరాదని ట్రాఫిక్ పోలీసులు గుర్తుచేశారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ విధిగా ధరించి వాహనాలు నడపాలని, రోడ్డు పై బదాయి కోరుగా విన్యాసాలు చేస్తూ ఉల్లాసంగా ట్రిబుల్ రైడింగ్ చెయ్యడం మూలంగా ఎక్కువ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ట్రాఫిక్ పోలీసులు తమ ఆవేదనను కూలంకషంగా తెలియచేశారు.మాతాపితలు తమ పిల్లలకి వాహనాలు ఇచ్చేటప్పుడు వారికి బైక్ ను నడపటానికి అర్హులుగా ఉంటేనే ద్విచక్ర వాహనాన్ని ఇవ్వాలేతప్ప.... మాకు బైక్ ఉందికదా... మా పిల్లలకు మేమిచ్చుకుంటాం....అంటూ తలబిరుసు తనాన్ని వ్యక్త పరుస్తూ ద్విచక్ర వాహనాన్ని నడపటానికి మీ యువశక్తి పరులకు లైసెన్స్ లేకపోయినను ఇష్టానుసారంగా రోడ్డుపై కొచ్చి పెట్రేగి పోవాలనుకుంటే ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు ఉపేక్షించబోమని అందునిమిత్తం చట్ట రీత్యా నిర్మోహమాటంగా తీసుకొనే తగు చర్యలకు బాధ్యులు కాగలరని సవివరంగా పూసగుచ్చినట్లు విన్నవించారు...మీ ఇంట్లో నుండి ఎంత ఆనందంగా బయటికి వస్తారో.... అంతే ఆనందంతో మీ మీ పనులను ముగించుకుని తిరిగి అంతే పరిమాణంలో మీ గమ్యాన్ని సకాలంలో చేరుకుని ప్రజలెల్లరు సదా సుఖంగా సకుటుంబ సమేతంగా చిరునవ్వులు లొలికిస్తూ హాయిగా లక్షణంగా వర్ధిల్లాలన్న ఆకాంక్ష తపనతో ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు నిరంతరం విశేష కృషి చేస్తూ శ్రమిస్తున్నారని తెలిపారు.ట్రాఫిక్ రూల్స్ ను విధిగా పాటించని వారికి మరియు మద్యం సేవించి కేరింతలు కొడుతూ జల్సా కోరుగా వాహనాలు నడిపే వారికి పెక్కు విధంగా జుల్మానా విధించటంతో పాటు జైలు శిక్షలు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తమదైన శైలిలో సదస్సుకు విచ్చేసిన వాహన చోదకులకు హెచ్చరించారు...

## అట్టహాసంగా హెయిర్ స్టైల్ పోటీలు



**మచిలీపట్నం జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బ్లోసెం బిజి బడ్స్ సంక్రాంతి సంబరాల్లో నిర్వహించిన హెయిర్ స్టైల్ పోటీలు అట్టహాసంగా జరిపారు. అతి తక్కువ సమయంలో నిర్వహించిన ఈ హెయిర్ స్టైల్ పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన లభించింది. చిన్నారుల నుంచి మహిళల వరకు అందరూ ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. దాదాపుగా 30 మంది మహిళలకు, బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలు లాంగ్ హెయిర్, ట్రెడిషన్ హెయిర్, హెయిర్ స్టైయిల్ విభాగాల్లో జరిగాయి. అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ మొక్తిక బొటిక్ నిర్వాహకురాలు, మేకప్‌ఉమెన్ రూప పుప్పాల న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఈ పోటీల్లో ప్రధమ బహుమతిని లాంగ్ హెయిర్ విభాగంలో బి. గుణ సంధ్య గెలుపొందారు. అలాగే ద్వితియ బహుమతిని ట్రెడిషనల్ హెయిర్ స్టైల్‌లో కె. హన్విత గెలుపొందారు. అదేవిధంగా తృతియ బహుమతిని ట్రెడిషనల్ విభాగంలో జయలక్ష్మి గెలుపొందారు. ఈ సందర్భంగా బ్లోసెం బిజి బడ్స్ నిర్వాహకురాలు ఎ కన్య మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలను ప్రతి ఏటా నిర్వహిస్తామని, ఈ ఏడాది ప్రత్యేకమన్నారు. ఈ ఏడాది మచిలీపట్నంలోనే ఏకైక తెలుగుదిన పత్రికతో కలిసి మహిళలకు హెయిర్ స్టైల్ పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అదేవిధంగా విజేతలకు బహుతులను స్పాన్సర్ చేసిన హైదర్ సిల్వర్స్ అధినేత ముజాహెద్ హుస్సేన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయనిర్ణేతగా వ్యవహరించిన రూపకు కన్య మెమెంటోతో సత్కరించారు.

## సంస్కార్ పాఠశాల లో సంక్రాంతి శోభ

**ఆనందోత్సాహాలతో సంక్రాంతి వేడుకలు**

**సాంప్రదాయ దుస్తుల్లో సందడి చేసిన తల్లిదండ్రులు విద్యార్థులు**



**మచిలీపట్నం జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భోగి మంటలు.. గొబ్బెమ్మలు.. పాల పొంగళ్ళు.. హరిదాసుల కీర్తనలు.. గంగిరెద్దుల విన్యాసాలు.. విద్యార్థులు వేసిన రంగురంగుల సంక్రాంతి ముగ్గులు.. బొమ్మల కొలువు.. కోలాట భజనలు.. పతంగుల అలంకారం వంటి కార్యక్రమాలతో నగరంలోని పదవ డివిజన్ సుకర్లాబాద్ లోని సంస్కార్ పాఠశాల లో శుక్రవారం సందడి నెలకొంది. శనివారం నుంచి స్కూల్‌కు సంక్రాంతి సెలవులు కావడంతో స్కూల్ యాజమాన్యం శుక్రవారమే సంక్రాంతి వేడుకలను స్కూల్ ఆవరణలో అత్యంత వైభవంగా, ఆనందోత్సవాల మధ్య నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో ఈ వేడుకల్లో పాల్గొనగా, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు రామ తులసి మాట్లాడుతూ సిరులు కురిపించే సంక్రాంతి పర్వదినాన్ని తెలుగు వారు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సిరిసంపదలకు, భోగభాగ్యాలకు ఈ పండగ అద్దం పడుతుందన్నారు.

## నారాయణ పాఠశాల లో ఘనంగా సంక్రాంతి సంబరాలు






**గన్నవరం, జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గన్నవరం విద్యానగర్ నారాయణ పాఠశాలలో శుక్రవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి విద్యార్థులకు తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. పాఠశాల ఆవరణమంతా విద్యార్థులు వేసిన రంగురంగుల ముగ్గులతో గొబ్బెమ్మలతో కళకళలాడింది విద్యార్థులు అందరూ తెలుగువారి సంప్రదాయ దుస్తులతో మెరిసిపోతూ పండుగ వాతావరణం సృష్టించారు పండుగ వేడుకలో భాగంగా హరిదాసు కీర్తనలు, భోగిమంటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, సంక్రాంతి పాటలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ భాషా మాట్లాడుతూ నేటి తరానికి మన పండుగలు ఆచార సంప్రదాయాలు వాటి గొప్పతనాన్ని తెలియజేయడమే ముఖ్య ఉద్దేశమ అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మస్తాన్ భాషా, ఏజీఎం సత్తిరెడ్డి,ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపల్ అనూష,ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపల్ శిరీషఎకడమిక్ డీన్ నవీన, మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మిర్చి రైతులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం

- పంటల బీమా పథకం లేకపోవటం భారీ నష్టం
- ఎన్యూమరేషన్ చేయకపోవడం బాధాకరం....
- రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కే వి వి ప్రసాద్

**పెనుగంచిప్రోలు, జనవరి 9( వార్త ప్రభ)** ఖరీఫ్ సీజన్ లో మిర్చి పంటకు సోకిన వివిధ రకాల తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టకపోవడం వల్ల మిర్చి రైతుల తీవ్రంగా నష్టపోయారని కనీసం పంటల బీమా పథకం అమలులో లేకపోవడంతో పరిహారం అందే ఆవకాశం లేకుండా పోయిందని, రాష్ట్ర ప్రభుత్వ శీ తక్షణమే తెగుళ్ళతో దెబ్బతిన్న పంటలను ఎన్యూమరేషన్ చేసి ప్రతి ఎకరానికి రూ.75 వేలు చొప్పున పరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వి వి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుమండలం, ముచ్చింతాల గ్రామంలో వివిధ రకాల తెగుళ్ళు వలన దెబ్బతిన్న మిర్చి పంటలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వివి ప్రసాద్,ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఎన్టీఆర్ జి రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మల్నీడి యల్లమందారావు, చుండూరు సుబ్బారావు,జిల్లా రైతుసంఘం నాయకులు పొన్నం నరసింహారావు తదితర ప్రతినిధి బృందం శుక్రవారం పరిశీలించింది. జరిగిన నష్టం గురించి రైతుల నుండి వివరాలను అడిగి తెలుకుంది. మిర్చి రైతులు మాట్లాడుతూ గత రెండు నెలల కాలం నుండి మిర్చి పంటకు నల్లతామర,ఎండు , ముడత, బొబ్బర, జెమినీ వైరస్ లాంటి తెగులు వల్ల తీవ్రంగా నష్టపోయామని ప్రతినిధి బృందానికి తమ ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చి రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రతినిధి బృందాన్ని కోరారు.ఈ సందర్భంగా కే వి వి ప్రసాద్ మాట్లాడుతూ గత సంవత్సరం మిర్చి పంటలకు గిట్టుబాటు ధర లేక నష్టపోయారని ఈ సంవత్సరం తెగులు వల్ల పంటలు దెబ్బతిని ఆర్థికంగా రైతు లు కృంగిపోయారని రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందే తప్ప తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టకపోవడం దారుణమని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంపై ధ్వజమెత్తారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తెగులు వల్ల నష్టపోయిన



పంటలను ఎన్యూమరేషన్ చేసి దెబ్బ తిన్న ప్రతి ఎకరానికి రూ.75 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, ప్రస్తుత పంటలను కాపాడటానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, పురుగు మందులు, ఎరువులు ఉచితంగా అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పంట రుణాలు అందించకపోవడం వల్ల అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మిర్చి పంట పండించారని వీరిని ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. పంటల భీమా పథకం అమలులో లేకపోవడం వల్ల ఎక్కువమంది కౌలురైతులేనష్టపోతున్నారని,పంటల బీమా పథకాన్ని వర్తింపజేసి పరిహారం చెల్లించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్నీడి యల్లమందారావు,చుండూరు సుబ్బారావులు మాట్లాడుతూ మిర్చి రైతులను ఆదుకోకపోతే అప్పులు పెరిగి ఆత్మహత్య చేసుకునే దుస్థితికి నెట్టవేయబడతారని,దానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ స్పందించి మిర్చి రైతులను ఆదుకోవడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మాల వెంకటేశ్వరరావు, చల్లాలశివాజీ (సిద్ధాంతి )నల్లజర్ల రాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు..

## గంజాయి పై ఉక్కు పాదం- కృష్ణాజిల్లా కలెక్టరు




**మచిలీపట్నం జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో గంజాయి అమ్మకాలను నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడుతో కలిసి నార్కోటిక్స్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కూడా ఎట్టి పరిస్థితులను గంజాయి గానీ మాదకద్రవ్యాలు గాని అమ్మకాలు జరగరాదన్నారు. కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచి గంజాయి అమ్మకాలను నియంత్రించాలన్నారు. ముఖ్యంగా చేపలు, రొయ్యలు చెరువుల దగ్గర పనిచేసే బీహార్, బెంగాలు తదితర రాష్ట్రాల వలస కూలీల జాబితా సేకరించి వారిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. అలాగే వ్యవసాయ కూలీలు గా పనిచేసే ఇతర రాష్ట్రాల వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిశ్రమల వద్ద కూడా పనిచేసే వలస కూలీల జాబితా సేకరించి వారి కార్యకలాపాలను గమనించాలన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, వైద్య,ఇంజనీరింగ్ తదితర కళాశాలల్లో కూడా ఆకస్మిక తనిఖీలు చేసి గంజాయి అమ్మకాలు ఏమైనా జరుగుతున్నాయా గమనించాలన్నారు. మందుల దుకాణాలను కూడా ఆకస్మిక తనిఖీ చేయాలన్నారు.భవన నిర్మాణాల వద్ద కూడా ఇతర ప్రాంతాల కూలీలు వివరాలను సేకరించాలన్నారు.మత సంబంధమైన ఉత్సవాలు జరిగిన సందర్భంలో ఇతర ప్రాంతాల నుండి వచ్చే వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.ఇందుకోసం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మత్స్యశాఖ, విద్యాశాఖ, పరిశ్రమల శాఖ సిబ్బంది మహిళా పోలీసులు రెవెన్యూ సిబ్బందినీ చైతన్య పరిచేందుకు తొలుత గంజాయి అమ్మకాల పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారుసంక్రాంతి పండుగ తరువాత తాను, జిల్లా ఎస్పీ కలిసి సంయుక్తంగా మూడు డివిజన్లలో గంజాయి అమ్మకాలు, సైబర్ నేరాలు, పోక్సో చట్టం తదితర ముఖ్యమైన విషయాలపై అవగాహన శిబిరాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలన్నారు. అమాయకులను ఎవరిని కూడా అనవసరంగా గంజాయి కేసులలో ఇరికించరాదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. నిజంగా గంజాయితో సంబంధం ఉండి ఉంటే తప్పకుండా వారిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయాలన్నారు.జిల్లా ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ జిల్లాలో గంజాయికి సంబంధించి 36 కేసులను నమోదు చేశామన్నారు. జిల్లాలో 150 మందిని నిందితులను అరెస్టు చేసి 1,07,32,795 రూపాయల విలువ గల 475.261 కిలోల గంజాయిని, ఒక గ్రాము కోకిన్, 116 గ్రాముల సిరప్, ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.మరో 407 మంది గంజాయితో సంబంధం ఉన్న నిందితులను గుర్తించామని వారి కార్యకలాపాలను గమనిస్తున్నామన్నారు.జిల్లాలోని కొన్ని సంబంధిత ప్రభుత్వ శాఖలు, మహిళా పోలీసు అధికారుల సమన్వయంతో అన్ని గ్రామాలు పట్టణాలు ప్రముఖ ప్రదేశాలు, విద్యాసంస్థల్లో గంజాయి విక్రయాలపై, చెడు వ్యసనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో 326 ఈగల్ క్లబ్బులు ఏర్పాటు చేశామన్నారు. ఎవరికైనా గంజాయి విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్ హౌస్ అధికారికి తెలియజేయాలని ప్రజలకు తెలుపుతున్నామన్నారు. పోలీస్ స్టేషన్ హౌస్ అధికారి వారి పరిధిలో వారంలో 3 రోజులు 3 గ్రామాల్లో పర్యటించి ఫోక్సభ చట్టం, సైబర్ నేరాలు, గంజాయి విక్రయాలు, మాదకద్రవ్యాల విక్రయాలు పై ప్రజలకు అవగాహన కల్పించనున్నామన్నారు.గంజాయి అమ్మకాల నియంత్రణలో అన్ని ప్రభుత్వ శాఖలు తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా గంజాయిని వ్యతిరేకిస్తూ పోలీస్ శాఖ రూపొందించిన వివిధ రకాల గోడపత్రాలను జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ ఆవిష్కరించారు.అలాగే ఆకర్ష ఫౌండేషన్ అధినేత ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ గర్రె శంకర్రావు రూపొందించిన మత్తు పదార్థాలకు దూరంగా యువత ఉండాలని తెలియజేసే పుస్తకాలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో మచిలీపట్నం ఇన్చార్జ్ ఆర్డిఓ పోతురాజు డిఎస్పి సిహెచ్ రాజా, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ యుగంధర్, మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజా, విద్యాశాఖ ఏడి విద్యాలత, జి ఎస్ టి ఓ సర్దార్ పాషా, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, డి డి సి ఓ అన్వేష్ రెడ్డి, జి జి హెచ్ ఆర్ ఎం ఓ నిరంజన్ రెడ్డి, ఈగల్ పోలీస్ ఇన్స్పెక్టర్ రవీంద్ర, మురళీమోహన్, కే మూర్తి ,మంగినపూడి, గిలకలదిండి, పాలకాయ తిప్ప, ఓర్లగుందితిప్ప పోలీస్ స్టేషన్ల ఇన్స్పెక్టర్లు, ఆకర్ష ఫౌండేషన్ ప్రతినిధి హరిత, ఆన్లైన్లో గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, ఉయ్యూరు ఆర్డిఓ బిఎస్ హేలా షారోన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పల్లెపాలెం హైస్కూల్ నందు అంబరాన్ని అంటిన సంక్రాంతి సంబరాలు....

**కృత్తివెన్ను జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లె పాలెం నందు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.బాలికలు రంగురంగుల రంగవల్లులతో పాఠశాల ఆవరణ అంతా అలంకరించారు.పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు టి వి వి ప్రసాదు,రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్య ప్రకాష్ ఆర్ద్వర్యం లో జరిగిన ఈ కార్య క్రమంలో బాలబాలికలు అత్యంత ఆనందంగా పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేయడం జరిగింది. విద్యార్థులు సంక్రాంతి సెలవులను సాంప్రదాయక ఆటపాటలతో ,ఆనందంగా గడపాలని వారు కోరారు. ఈ కార్య క్రమంలో విద్యా కమిటీ చైర్మన్ మోకా రామకృష్ణ, ఉపాధ్యాయులు యేసు పాదం, విజయ్ కుమార్, మురళీ కృష్ణ, ప్రభ, రేఖ, దుర్గా జ్యోతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు....



## విద్యార్థుల భవితకు మలుపు

**- కెయూ రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు**

**- ముగిసిన ఎన్ ఎస్ ఎస్ శిబిరం**



**మచిలీపట్నం జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జాతీయ సేవా శిబిరాలలో పాల్గొనే విద్యార్థులు తమ భవిష్యత్ కు మంచి బాటలు వేసుకుంటారని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు అన్నారు. గురువారం కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ యూనిట్ - 1 ఆధ్వర్యములో బందరు కోట లో నిర్వహిస్తున్న సేవా శిబిరం ముగింపు కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రసంగించారు. నాలుగు గోడల మధ్య చదువుకోవటం ఒకెత్తయితే జాతీయ సేవా శిబిరాలలో పాల్గొని నేర్చుకోవడం జీవితానికి పాఠం లాంటిదన్నారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు శిబిరం లో పాల్గొన్న వాలంటీర్లను అభినందించారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎం. శ్రావణి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం లో ఇతర ఎన్ ఎస్ ఎస్ విభాగాలు మరింత ఉత్సాహం తో పనిచేయాలన్నారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి డా సల్మా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భముగా ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు మున్సిపల్ ఉన్నత పాఠశాల కు ప్లాస్టిక్ కుర్చీలు బహుకరించారు. ఈ సందర్భంగా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రోగ్రామ్ అధికారిణి డా. సల్మా ను సత్కరించారు.

## శ్రీ చైతన్య హై స్కూల్ లో ఘనంగా సంక్రాంతి వేడుకలు



**పెనుగంచిప్రోలు, జనవరి 9( వార్త ప్రభ)** పెనుగంచిప్రోల మండలంలోని అనిగండ్లపాడు శ్రీ చైతన్య హైస్కూల్లో శుక్రవారం సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.డైరెక్టర్స్ నగేష్, నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించబడిన ఈ వేడుకల్లో పిల్లలచే సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటలు,ప్రదర్శన చేసారు. భోగి మంటలు వేశారు. ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి గెలుపొందిన వారికీ బహుమతులు అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి ఎంత గొప్పదో మన పండగలు తెలియజేస్తాయని, కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగల ద్వారా మనమందరం భారతీయులమని చాటి చెప్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్న కూటమి ప్రభుత్వం

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్**



**ఇబ్రహీంపట్నం, జనవరి 09(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం మండలం కాచవరం గ్రామంలో రూ.15 లక్షల ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ నిధులతో నిర్మించనున్న సిమెంట్ రహదారుల నిర్మాణానికి మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా పల్లెపండుగ 2.0 పనులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇటు సంక్షమంతో పాటు అభివృద్ధి రెండు కళ్ళుగా ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం చంద్రబాబు గారి పాలన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎంపీపీ పాలడుగు జోత్స్న, స్థానిక సర్పంచ్ రాజేంద్రప్రసాద్, టిడిపి సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య, ఎన్డీఏ కూటమి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 14వ తేదీన శ్రీ వాగు వీరాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో గోదాదేవి కళ్యాణం



**విజయవాడ పశ్చిమ జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఈ నెల 14వ తేదీన వాగు సెంటర్ లోని వీరాంజనేయ స్వామి దేవస్థానం ప్రాంగణంలో గోదాదేవి కళ్యాణం నిర్వహించబడుతుందని ఆలయ అర్చకులు డాక్టర్ విన్నకోట శ్రీనివాసరావు శర్మ తెలిపారు, ఈ కార్యక్రమాన్ని కుంచెం శ్రీనివాసరావు, శ్రీమతి రాణి దంపతులచే ఈ కార్యక్రమంలో నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగు శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో గోదాదేవి కళ్యాణం, ఉదయం 9 గంటలకు నిర్వహించబడనని తెలిపారు, అదేరోజు సాయంత్రం మకర సంక్రాంతి పురస్కరించుకొని అయ్యప్ప స్వామి వారి ప్రాంగణంలో జ్యోతి దర్శన కార్యక్రమం నిర్వహించబడునని తెలిపారు, ఈ కార్యక్రమం ఆలయ ఈవో వై సీతారామయ్య, ఆలయ ఫౌండర్ ప్రెసిడెంట్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించనున్నామని తెలిపారు, కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు.

# మాజీ సీఎం జగన్ "అమరావతి" పై విషం కక్కుతున్న "రాక్షసుడు"

● రాజకీయ లబ్ధి కోసం శ్రీవారితోనే చలగాటమాడుతున్న మాజీ టీటీడీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి ● రాష్ట్ర యాదవ వెల్ఫేర్ , డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ● జి నరసింహ యాదవ్ ధ్వజం



**తిరుపతి : జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మాజీ సీఎం వైస్ జగన్మోహన్ రెడ్డి ఒకవైపు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మరోవైపు అవినీతిపై మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన అనేక సమావేశంలో నరసింహ యాదవ్ మాట్లాడారు ఐదేళ్ల వైసిపి రాక్షస పాలనను నేటికీ ప్రజలు మరవలేక పోతున్నారని గుర్తు చేశారు. జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులకు అధికారం కోల్పోయిన అహంకారం తగ్గలేదన్నారు. జగన్ అమరావతి పై మాట్లాడటం విడ్డూరమన్నారు. మూడు రాజధానులు అంటూ రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలని చూశారని ఎద్దేవా చేశారు. ఆంధ్రరాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే జగన్ చూడలేకపోతున్నారన్నారు. జగన్ మాటలు నమ్మారని నరసింహ యాదవ్ మరోసారి గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టారని, నది గర్భంలో అమరావతి నిర్మాణం అంటూ, అపద్ధప్పు హామీలతో అధికారం చేపట్టిన జగన్ హిందూ మతంపై దాడి చేయిస్తున్నారన్నారు. రాయలసీమ కు అన్యాయం జరిగిందని మాట్లాడటం సిగ్గుచేట అన్నారు. తిరుమల పవిత్రత గురించి భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడటం అసలు విడ్డూరమన్నారు. భూమన శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని శ్రీవారితో పెట్టుకుంటే అనుభవించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో జగన్ బంధువులే టీటీడీ చైర్మన్ లుగా ఉన్నారు టీటీడీ చైర్మన్ లు గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డి ,భూమన్ కరుణాకర్ లు ఎన్నో అపచారాలు చేశారన్నారు. టిటిడి లో కల్తీ నెయ్యి, పరకామణి దొంగలతో చేతులు కలిపి శ్రీవారికి మహా అపచారం చేసిన వైసీపీ నేతలు వైసీపీ ప్రభుత్వం లో అక్రమకేసులు పెట్టి అమాయక ప్రజల గొంతు కోశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాకా టీటీడీలో మచ్చలేకుండా పరిపాలన సాగుతోందన్నారు. సీఎం చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, గురించి మాట్లాడే అర్హత భూమన కు లేదన్నారు. తిరుమలలో మద్యం బాటిల్ లను వైసీపీ నాయకులు ఆదేశాలతో అక్కడ వేసి తద్వారా రాజకీయ లబ్ధి కోసం వారి మీడియా మరియు సోషల్ మీడియాలో ప్రచారం చేసి ఇప్పుడు ఏమి తెలియనట్లు అక్రమ కేసులంటూ భక్తులను నమ్మించే ప్రయత్నం చేయడం ధారుణంన్నారు. వైసిపి ప్రభుత్వ పరిపాలనలో జగన్మోహన్ రెడ్డి 5 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ,తిరుపతి ఎమ్మెల్యేగా కరుణాకర్ రెడ్డి ఉన్నప్పుడు తిరుపతి పార్లమెంటు ఉపఎన్నికల్లో మరియు నగర పాలక సంస్థ ఎన్నికల్లో, తిరుపతి టవున్ బ్యాంకు ఎన్నికల్లో అప్రజాస్వామికంగా ఎన్నికల నిర్వహించడం ప్రజలు మరిచిపోలేదని నరసింహ యాదవ్ తెలియజేశారు.

# విద్యా ప్రదాత శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు

● విద్యా వికాసమే సమాజ అభివృద్ధికి పునాది ● విద్య కోసం 96 ఎకరాలు దానం చేసిన దాత కృత్తివెంటి పేర్రాజు పంతులు ● సంస్మరణ దినోత్సవం సభలో ఘన నివాళులు అర్పించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీదేవి








**రామచంద్రపురం జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)**: విద్యా వికాసమే సమాజ అభివృద్ధికి పునాది అన్న నమ్మకంతో తన సర్వస్వాన్ని విద్యార్థుల భవిష్యత్తుకు అంకితం చేసిన మహానుభావుడు శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు అని కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కొనియాడారు. శ్రీ కృతి వెంటి పేర్రాజు పంతులు 17వ సంస్మరణ దినోత్సవం సభ శుక్రవారం కృత్తివెంటి విద్యా ట్రస్ట్ బోర్డు, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు అధ్యక్షతన వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ విద్య కోసం 96 ఎకరాల భూమిని దానం చేసి చరిత్ర సృష్టించిన ఆ మహనీయుని సంస్మరణ సభను ఈ రోజు ఘనంగా నిర్వహించడం ఆనందకరమన్నారు. స్వార్థరహితంగా సమాజ హితాన్ని కాంక్షంచి చేసిన ఆయన త్యాగం తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. నేటి తరానికి విద్య ఎంత అవసరమో గుర్తించి, ఆ దిశగా పేర్రాజు పంతులు చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కృత్తివెంటి పేర్రాజు పంతులు పేరు పెట్టేలా మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి మాట్లాడుతూ ఒక వ్యక్తి జీవితం ముగిసినా, ఆయన ఆలోచనలు, ఆదర్శాలు చిరకాలం నిలిచిపోతాయని, ఆ కోవలోనే పేర్రాజు పంతులు ఉన్నారని అన్నారు. ప్రస్తుత కాలంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు లాంటి దాతలు అరుదని అయన చేసిన దానం రాష్ట్రానికే గర్వకారణమని సభలో తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాట్లాడుతూ పేర్రాజు పంతులు చూపిన మార్గంలో నడిచి, సమాజానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధికి సేవ చేసే అవకాశం తనకు కల్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సంస్మరణ సభలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు సిరిగినీడి దుర్గాప్రసాద్, శివరామకృష్ణ, బండి స్వామి, నరాల సురేష్, అంపోలు సత్యనారాయణ, కొండపల్లి రవికుమార్, తదితరులు ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు, ట్రస్ట్ లో పనిచేస్తున్న ఆయాలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కృత్తివేంటి పేరజ్ పంతులు మనవడు పేర్రాజు పంతులు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డాక్టర్ స్టాలిన్, సెక్రటరీ కొవ్వూరి తాతారెడ్డి, ట్రస్ట్ బోర్డు ఈవో సిహెచ్ సత్యనారాయణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగ శ్రీనివాస్, ఎంఈఓ పి వీర రాఘవరెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్ చిన్నబ్బాయి, కౌన్సిలర్ కేతా సుజాత,విద్యావేత్త జీవి రావు, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ గణేష్ శర్మ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు నారపురెడ్డి బలరాం, వినోద్ చౌదరి, కూటమి పార్టీ నాయకులు చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, అడ్డూరి వర్మ, నరాల సురేష్, పడాల సూరిబాబు, అంపోలు సత్యనారాయణ, గె డ్డం శ్రీనివాస్, కనకాల వెంకటేశ్వరరావు, గన్నమణి చక్రవర్తి , పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆ మహనీయుని విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు.

# సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

## శ్రీ అగస్త్యలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**కాకినాడ, జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)–** సంస్కృతీ సంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీకగా నిలుస్తుందని శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ డి.శ్రీ పల్లవి పేర్కొన్నారు. స్థానిక శాంతినగర్ లోని శ్రీ అగస్త్య స్కూల్ వశిష్ట క్యాంపస్ లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై భోగి మంటను వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ అగస్త్య ఎడ్యుకేషనల్ సొసైటీ అకడమిక్ డైరెక్టర్ డి. శ్రీ పల్లవి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మన సంస్కృతీ సంప్రదాయాలను గౌరవిస్తూ తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి పండుగను జరుపుకోవాలన్నారు. పాఠశాలలో పల్లె సంస్కృతి ఉట్టిపడేలా ఎండుగడ్డితో గుడిసెలు వేయడంతో పాటు విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి సంబరాల్లో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు వేయడంతో పాటు సాంప్రదాయ నృత్యాలు, భోగి మంటలు వేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి పార్లమెంటరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న చిట్టిబాబు




**ఇబ్రహీంపట్నం, జనవరి 09(వార్తా ప్రభ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ కమిటీల సమావేశం ఉండవల్లిలో నారా లోకేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధతో కలిసి పాల్గొన్నారు జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి నియామకమైన చెన్నుబోయిన చిట్టిబాబు కు శుభాకాంక్షలు తెలిపారు నారా లోకేష్. జిల్లాలోని అందరి నాయకులతో సమన్వయంతో కలిసి పనిచేయాలని, పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ఇన్చార్జి మంత్రి, శాసనసభ్యులతో కలిసి ప్రజాదర్బార్, కార్యకర్తల సమావేశాలు నిర్వహించేలా,అనీ కమిటీలను పూర్తి చేసి, నియోజకవర్గాల్లో, మండలాల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకొని, ఎన్టీఆర్ జిల్లా లో పార్టీ క్షత్రస్థాయిలో కూడా బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా గా ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు కొండపల్లి పురపాలక చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు మునిసిపాలిటీ సమస్యలను మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి మునిసిపాలిటీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. జిల్లాలో పార్టీ కేడర్ తో సమన్వయంతో మరలా 2029 లో అధికారం చేపట్టే విధంగా పార్టీని నిర్ణయాలను, ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలని తెలిపారు.

# యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గుట్టాల గోపి



**మచిలీపట్నం జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, చెడు వ్యసనాలకు లోనై జీవితాలను దుర్భరం చేసుకోవద్దని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గుట్టాల గోపి యువతకు పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, విద్యార్థులతో కలిసి జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి నగరంలోని సాయిబాబా గుడి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగాన్ని నియంత్రించి యువత భవిష్యత్తును కాపాడేందుకు జాతీయ న్యాయసేవాధికార సంస్థ (ఎన్ఎల్ఎస్ఏ) డ్రగ్స్ అవేర్నెస్ వెల్నెస్ నావిగేషన్ (డాన్) అనే పథకాన్ని ప్రారంభించిందని తెలిపారు. ఎన్ఎల్ఎస్ఏ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రపంచంలో అత్యధిక యువత జనాభా కలిగిన దేశం భారత్ అని, అయితే దేశంలోని యువత గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసై తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ సంపద దేశ సంపదని పేర్కొంటూ అటువంటి విలువైన సంపదలో యువతది కీలక పాత్ర అని, అటువంటి యువత జీవితాలు చెడు వ్యసనాలకు లోను కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తద్వారా ఇది దేశ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. దాదాపు 75 సంవత్సరాలుగా ప్రపంచ దేశాలు భారతదేశాన్ని అభివృద్ధి చెందుతూ ఉన్న దేశంగానే గమనిస్తున్నారు గాని, అభివృద్ధి చెందిన దేశంగా గుర్తించడం లేదని, ఇది కేవలం, యువత చెడు వ్యసనాలకు లోనై వాటి దుష్ప్రభావాలతో యువత నిర్వీర్యం కావడం కారణం అని పేర్కొన్నారు. యువత అనేక రకాల మత్తు పదార్థాలకు లోను కాకుండా ఉండేందుకు, తమ పిల్లలు సరైన మార్గంలో పయనించాలంటే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అదేవిధంగా పాఠశాల, కళాశాల యాజమాన్యాలు పరిశోదాత్మకంగా పరిశీలిస్తూ విద్యార్థుల ప్రవర్తనపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య, అదనపు సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ యుగంధర్, తొమ్మిదవ అదనపు జిల్లా జడ్జి ఎస్ సుజాత, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి హిమబిందు తదితర న్యాయమూర్తులు, న్యాయవాదులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మీర్జాపురం గ్రామంలో సాంప్రదాయ క్రీడలు ప్రారంభం



**నూజివీడు: జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో శుక్రవారం వారధి సంక్రాంతి సంబరాలు ప్రారంభం అయ్యాయి. ఈ సంబరాలను మాజీ మంత్రి, మాజీ ఎంపీ మాగంటి బాబు, నూజివీడు మాజీ ఏఎంసీ చైర్మన్ కాపా శ్రీనివాసరావు, ముసునూరు మండలం టీడీపీ అధ్యక్షులు గద్దె రఘు బాబు, నూజివీడు మండలం టీడీపీ అధ్యక్షుడు యనమదల వాసు, టీడీపీ నేతలు అక్కినేని చందు తదితరులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాగంటి బాబు, కాపా శ్రీనివాసరావు, గద్దె రఘు బాబు లు మాట్లాడుతూ సంప్రదాయ క్రీడలు అంతరించిపోతున్న కారణంగా మీర్జాపురం గ్రామంలో గ్రామీణ క్రీడలైన కబడ్డీ పోటీలు, ఆవుల అందాల పోటీలు, గేదెల పాల అందాల పోటీలు, మహిళలకు ముగ్గులు పోటీలు, చిన్నారులకు రన్నింగ్ రేస్, యువకులకు కబడ్డీ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ సాంప్రదాయ క్రీడల్లో పాల్గొనటానికి వందలాదిమంది ఉత్సాహం చూపుతున్నారన్నారు. సంక్రాంతి పండుగ అనగానే ఉభయగోదావరి జిల్లాలు గుర్తుకు వస్తాయని, దేశ విదేశాల నుండి సైతం సంక్రాంతి సంబరాలు పాల్గొనేందుకు వేలాదిగా తరలిరావడం అందరికీ తెలిసిందే అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులపాటు జరిగే కోడిపందాలను చూసేందుకు లక్షలాదిమంది ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రస్తుతం సెల్ ఫోన్ సాంప్రదాయం నడుస్తుందని, సాంప్రదాయ క్రీడల్లో యువకులు ఎక్కువగా పాల్గొనడం వల్ల ఈ సాంప్రదాయాన్ని మునుముందు కొనసాగించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గోగినేని మధు, తుమ్మల ఆది, తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం.

## నియోజకవర్గంలో 14 ఆరోగ్య కేంద్రాలకు రూ.5.04కోట్లు మంజూరు.

## ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్.



**చల్లపల్లి: అవనిగడ్డ; జనవరి 9(వార్తాప్రభ ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఏపీ అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం చల్లపల్లి నారాయణరావు నగర్లో 15వ ఫైనాన్స్ కమిషన్ హెల్త్ గ్రాంట్స్ నిధులు రూ.36 లక్షలతో నిర్మించనున్న గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, చల్లపల్లి మండలంలో ఐదు గ్రామీణ ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.కోటీ 80లక్షలు, అవనిగడ్డ నియోజకవర్గంలో 14 ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ.5కోట్ల నాలుగు లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అసంపూర్తిగా ఉన్న 15 ఆరోగ్య కేంద్రాల భవనాలను పూర్తిచేసేందుకు రూ.కోటీ 36 లక్షల 90వేలు మంజూరు చేశారని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్యసేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. నిధులు మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు ధన్యవాదములు తెలిపారు. చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలో పేదలకు కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నారాయణరావు నగర్లో రహదారుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సాస్కి నిధులు తీసుకువచ్చి రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. చల్లపల్లి మండలంలో పల్లె పండుగలో రూ.1.07 కోట్లతో 18కిలోమీటర్ల మేర 18 సిమెంటు రహదారులను నిర్మించినట్లు తెలిపారు. పల్లె పండుగ రెండవ విడతలో రూ.67లక్షలు మంజూరైనట్లు చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.55 కోట్లతో 503 పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపామనీ, నిధుల మంజూరుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, డీసీ చైర్మన్ నిడమానూరు దిలీప్ కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్లు బోలెం నాగమణి, పైడిపాముల స్వప్న, పీఏసీఎస్ చైర్మన్ బొందలపాటి వీరబాబు, పంచాయతీ రాజ్ శాఖ డిఈఈ పగడాల సురేష్ బాబు, ఏఈఈ బొప్పన శ్రీనివాస్ ,వైద్యాధికారి డాక్టర్ శివరామకృష్ణ, పంచాయతీ ఈఓ పీవీ మాధవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లు తక్షణమే నెరవేర్చాలి

## మైలవరం ఎమ్మెల్యే వసంతకు వినతి



**ఇబ్రహీంపట్నం, జనవరి 9 (వార్తా ప్రభ ప్రతినిధి):** పీఏసీఎస్ ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చేలా చూడాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం సహకార బ్యాంకు ఎదుట పీఏసీఎస్ సిబ్బంది చేస్తున్న రిలే నిరాహారదీక్షలు శుక్రవారం కొనసాగాయి. జీవో నెంబర్ 36ను అమలు చేయాలని కొండపల్లి ప్రజాదర్బార్ లో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఏసీఎస్ ఉద్యోగులకు వేతన సవరణ చేయాలని, మధ్యంతర భృతి చెల్లించాలని, వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, గ్రాట్యుటీ 2 లక్షల నుంచి 5 లక్షలకు పెంచాలని, 2019 తర్వాత చేరిన సహకార ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే హెచ్ ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.20 లక్షల ఇన్సూరెన్స్ పాలసీని ప్రతి ఉద్యోగి కుటుంబానికి వర్తింపజేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ నాయకుడు, దాములూరు పీఏసీఎస్ సీఈవో కె.సతీష్, కొటికలపూడి, ఈలప్రోలు, ఇబ్రహీంపట్నం, మూలపాడు, గుంటుపల్లి పీఏసీఎస్ ల సీఈవోలు పవన్ కుమార్, రవి కుమార్, లక్ష్మి, సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జి.కొండూరు గ్రామంలో కరెంట్ నిలిపివేత

**జి.కొండూరు:జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** లైన్స్ మెయింటెనెన్స్ లలో భాగంగా మండల కేంద్రమైన జి.కొండూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో నేడు అనగా జనవరి 10 వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం. ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశా రు. గ్రామాల ప్రజలు సహకరించవలసిందిగా ఏఈఈ కోరారు.

# జి.కొండూరులో అబ్బుర పరుస్తున్న సంక్రాతి వాల్ పెయింట్స్

## పంచాయితీ సెక్రటరీ ఏటుకూరి వినూత్న ప్రయత్నం



**జి.కొండూరు:జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండల కేంద్రమైన జి.కొండూరు గ్రామంలో సంక్రాంతి వాల్ పెయింట్స్ అబ్బుర పరుస్తున్నాయి. గ్రామపంచాయతీ సెక్రటరీ, ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో ఏటుకూరి బసవలింగేశ్వరరావు తనదైన శైలిలో వినూత్న రీతిలో సంక్రాంతి పండుగ ఉట్టి పడేలా వాల్ పెయింట్స్ వేయించారు. సంక్రాంతి పండుగను స్ఫూర్తిగా తీసుకుని నిత్యం రద్దీగా ఉండే హై స్కూల్, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి పక్కన మండల ప్రజా పరిషత్ కమ్యూనిటీ భవనం కాంపౌండ్ వాల్ కి సంక్రాంతి పండుగ సంస్కృతి,సాంప్రదాయాలను గుర్తుచేస్తూ అద్దిన రంగురంగుల పెయింటింగ్స్ సూపర్ లను ఆకట్టు కుంటున్నాయి. గ్రామాలలో ఇలా వైవిద్య ప్రదర్శన ఎప్పుడూ లేదని,ఈ పెయింటింగ్స్ ను చూస్తుంటే సంక్రాంతి ముందుగానే వచ్చిందా అన్న భావన కలుగుతోందని గ్రామస్తులు అనుకోవటం విశేషం. నేటి కంప్యూటర్ కాలంలో తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే పండు గలకు ఆదరణ తగ్గిపోకూడదనే ఉద్దేశంతో సంక్రాతి వాల్ పెయింటింగ్స్ వేయించినట్లు గ్రామ పంచాయితీ సెక్రటరీ ఏటుకూరి బసవలింగేశ్వరరావు తెలియజేశారు. హరిదాసులు, గంగిరెద్దుల వారు ఇంటింటికి వచ్చి పాటలు పాడుతూ, విన్యాసాలు చేస్తూ సందడి చేసే చిత్రలతో కూడిన వాల్ పెయింట్స్ చూడముచ్చటగా ఉన్నాయి.

# ఆర్కిడ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు.

**నూజివీడు, జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు పట్టణంలోని




ఆర్కిడ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో హరిదాసు వేషాలు, భోగి మంటలు పొంగళ్ళు వేయడం, అందమైన ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టడం, పతంగులు ఎగురువేయడం ఎంతగానో ఆకట్టుకుంది. సంక్రాంతి గుర్తుకు తెచ్చే ఆటపాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మొక్కపాటి రుక్మిణి, డైరెక్టర్లు గొల్లపూడి రవిబాబు మేడ శ్రీహర్ష, అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు

## సున్నంపాడు లో 100 శాతం ఇంటి పన్ను వసూలు

**జి.కొండూరు:జనవరి 9 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మండలంలోని సున్నంపాడు గ్రామం లో నూటికి నూరు శాతం ఇంటి పన్ను వసూలు అయ్యాయని ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో ఏటుకూరి బసవలింగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మొత్తం 249 అసెస్మెంట్ ఉండగా మొత్తం రూ.1,12,594 లు వసూలు చేసినట్లు తెలిపారు. 100 శాతం ఇంటి పన్ను వసూలలో ఎన్టీఆర్ జిల్లాలోనే సున్నంపాడు ప్రథమ స్థానం నిలిచిందని తెలిపారు. ఈ సందర్భం గా జిల్లా పంచాయతీ రాజ్ అధికారి (డి పి వొ) లావణ్య కుమారి, డి ఎల్ పి ఓ రాఘవ ఇంచార్జ్ డిప్యూటీ ఎంపీడీవో వై.బసవలింగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ దేశం సుధాకర్ రెడ్డి, గ్రామపంచాయతీ సెక్రటరీ హరికృష్ణ లను అభినందించారు.

# గుడివాడ -టిడ్కో కాలనీలో మన ఇల్లు -మన సంక్రాంతి 2026





**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా కృష్ణాజిల్లా గుడివాడ పురపాలక సంఘం మల్లయపాలెం లోని టిడ్కో గృహ సముదాయము లోని టిడ్కో గృహ లబ్దిదారులకు సంక్రాంతి సంబరాలు మన ఇల్లు మన సంక్రాంతి కార్యక్రమాలు గుడివాడ పురపాలక సంఘ పరిధిలో గల మల్లాయపాలెం, టిడ్కో గృహ సముదాయములలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారము సంక్రాంతి సంబరాలు -2026 నిర్వహించడమైనది. దీనిలో భాగంగా ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడ్కో లబ్దిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగు రంగుల ముగ్గులతో అలరించినారు. ఆ ప్రాంతం అంతా పండుగ శోభ సంతరించుకుంది. సంక్రాంతి సంబరాలు జరుగు ప్రదేశమును శుభ్రత మరియు హరిత కార్యక్రములో భాగముగా పరిశుభ్రత, పారిశుధ్యం మరియు పర్యావరణ బాధ్యత పై అవగాహన కలిగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఏ.పి.టిడ్కో సిబ్బంది, మెప్మా సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు టిడ్కో లబ్దిదారులు పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితియ, తృతీయ బహుమతులు అతిధులచే అందచేయడం జరిగినది.

# సాంప్రదాయాల పరిరక్షణ అందరి భాధ్యత



**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో అక్కినేని కళాపీఠం, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్‌ల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్ సంస్కృతి గొప్పలను ప్రతిబింబించే ఈ కార్యక్రమం కళాశాల పరిసరాలను ఉత్సవ వాతావరణంతో నింపింది. విద్యార్థులకు ఆకట్టుకునేలా ముగ్గుల పోటీలు నిర్వహించబడ్డాయి. అక్కినేని కళాపీఠం నిర్వహించిన బొమ్మల కొలువు ప్రదర్శనలో సంక్రాంతి బొమ్మలు, గ్రామీణ జీవన విశేషాలను సూచించే అద్భుత కళాకృతులు ప్రదర్శించబడ్డాయి. ప్రాచీన జానపద కళారూపాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎద్దుల బండి ప్రదర్శనలో బలమైన ఎద్దులు సొగసైన బండిలతో కళాశాల మైదానంలో తిరగడం విశేష ఆకర్షణ, హరిదాసులు సంక్రాంతి గీతాలు, జానపద పాటలు పాడుతూ వాతావరణాన్ని ఉల్లాసంగా మార్చారు. భోగి మంటల చుట్టూ విద్యార్థినుల కోలాటం, బియ్యం, రాగి మొదలైనవి విసిరే నృత్య ప్రదర్శనలు అద్భుతంగా ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థినులు, అధ్యాపకులు, సిబ్బంది అందరూ పూర్తి ఉత్సాహంతో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి జె ఎస్ కుమార్ ఈ సంబరాలు విద్యార్థుల్లో సాంస్కృతిక ఆసక్తిని పెంచుతాయని, సంప్రదాయాలను కాపాడుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె. ప్రసాద్, కొల్లి శ్రీనివాసరావు, కోశాధికారి పర్వతనేని కృష్ణ ప్రసాద్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా. ఎ.రామారావు, వైస్ ప్రిన్సిపల్ బి.ఎస్.ఎస్ పద్మజ, కళాపీఠం కన్వీనర్ డా. డి.ఎస్. ప్రత్యూష, ఉమెన్ డెవలప్మెంట్ సెంటర్ చైర్ పర్సన్ డి. విమల కుమారి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు అందరూ పాల్గొన్నారు.

# 13వ వార్డు పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై మున్సిపల్ కమీషనరు పరిశీలన..



**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** శుక్రవారం ఉదయం మున్సిపల్ కమీషనర్ ఎస్ మనోహర్ పట్టణంలోని 13వ వార్డు పరిధిలో పర్యటించి పలు పౌర సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డుకు సంబంధించిన పీజీఆర్ఎస్ ఫిర్యాదును పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గంగానమ్మ గుడి ప్రాంతంలో త్రాగు నీటి సరఫరా మరియు నీటి కాలుష్య పరిస్థితులను పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని అధికారులకు తగు సూచనలు జారీ చేయడం జరిగింది. అనంతరం నాగన్న చెరువు ప్రాంతాన్ని సందర్శించి ఆక్రమణల తొలగింపు అంశంపై సమీక్ష చేశారు. అలాగే వీధి వ్యాపారులతో సమావేశమై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం గురించి చర్చించడం జరిగినది. వార్డు నందు జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి, వార్డులో పరిశుభ్రత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కమీషనర్ సూచించారు.

# ఘనంగా వేంకటేశ్వరస్వామికి 'ముత్యాల హారతి'



**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక పాటిమీద జగన్నాధపురంలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు వార్షిక ధనుర్మాస మహోత్సవములలో భాగంగా గురువారము 'ముత్యాల హారతి' కార్యక్రమం అత్యంత వైభవోపేతముగా నిర్వహించారు. మహిళా భక్తులు గోపికల వేషధారణలో.. పురుషులు సాంప్రదాయ దుస్తుల ధరించి ఆలయ అర్చక స్వామి వేదాంతం అప్పలాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రోచరణ ద్వారా అష్టోత్తర శతనామార్చన నిర్వహించి శ్రీ స్వామి అమ్మవార్లకు వివిధ రకముల హారతులను అందించడం.. తదుపరి తీర్ధ ప్రసాదములు అందించడము జరిగినదని ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ చైర్మన్ లింగం శివరామ ప్రసాద్ (చిట్టిబాబు) మరియు సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రముఖ రైస్ మిల్లర్ పిన్నమనేని విశ్వేశ్వరరావు కన్నుమూత



**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** పట్టణానికి చెందిన ప్రముఖ రైస్ మిల్లర్ పిన్నమనేని విశ్వేశ్వరరావు (75) అబుదబీలో కన్నుమూశారు. వీరికి భార్య రత్నకుమారి, ఇరువురు కుమా రులు. పెద్దకుమారుడు డా॥ పిన్నమనేని కృష్ణప్రసాద్ అబుదబీలో వైద్య సేవలు అందిస్తున్నారు. 2వ కుమారుడు డా॥ పిన్నమనేని ప్రశాంత్ అమెరికాలోని ఫ్లోరిడాలో వ్యాపారవేత్తగా ఉన్నారు. కొద్దిరోజుల క్రితం వరకు ప్రశాంత్ నాట్స్ ఛైర్మన్ గా వ్యవహరించారు. విశ్వేశ్వరరావు భౌతికకాయం గుడివాడ రాత్రికి రాజేంద్రనగర్ 3వ లైన్ లోని ఆయన స్వగృహం గాయత్రి రెసిడెన్సీకు తీసుకురానున్నారు. శుక్రవారం ఉదయం 10గం॥ల తర-ంవాత అంత్యక్రియలు నిర్వహిస్తారని సోదరుడు పిన్నమనేని సాంబశివరావు తెలిపారు. విశ్వేశ్వరరావు మృతి పట్ల ఐఎంఏ పూర్వాధ్యక్షులు డా॥ పాలడుగు వెంకట్రావు, అధ్యక్షులు మాగంటి శ్రీనివాస్, కార్యదర్శి పుణుకొల్లు శ్రీనివాస్, కోశాధికారి డా॥ మనోజ్, వైద్యులు డా॥ పొట్లూరి వంశీ తదితర ఐఎంఏ నేతలు విశ్వేశ్వరరావు మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

# మానవతా గుడివాడ శాఖ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ శిక్షణా తరగతులు..



**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ వీకేఆర్ అండ్ వివిఎన్బి పాలిటెక్నిక్ కళాశాలలో కెరీర్ గైడెన్స్ మీద భవిష్యత్తు మీద వారికి అవగాహన కల్పించి ఏ రకంగా చదవాలి ఈ రకంగా ఫ్యూచర్ కోర్సులు చదవాలి, ఫారిన్ వెళ్లాలంటే ఏ పరీక్షలు,రాయాలి, టోఫేల్, ఐ ఇ,ఎస్, ల్, ఎస్ పి టి, జి ఏ టి వాటిని తెలియజేసి వారికి స్ఫూర్తి నింపడం జరిగింది. పాలిటెక్నిక్ కాలేజీలో ప్రతిభ ఉన్నవారికి ప్రథమ స్థానం ద్వితీయ స్థానం తృతీయ స్థానం పొందిన వారికి నగదు బహుమతులు అందించడమే కాకుండా వె-ంమొంటోలు, ప్రశంసాపత్రము లు విద్యార్థులకు సంస్థ కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ దండమూడి సీతారామస్వామి సభ్యుల సమక్షంలో ఉమ్మడి కృష్ణా జిల్లా పర్యావరణ కమిటీ చైర్మన్, సంస్థ చైర్మన్ పిన్నమనేని వేణుగోపాలరావు జాయింట్ సెక్రెటరీ వెంకట మోహన్ రావు కోశాధికారి బచ్చు రాధాకృష్ణ, సభ్యుడు సాంబశివరావు.. కాలేజీ ప్రిన్సిపాల్ నాగు ల సమక్షంలో విద్యార్థులకు అందచేశారు.

# రేమల్లి, కానుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్ లో రంగవల్లుల పోటీలు నిర్వహించిన కళ్ళేపల్లి





**హనుమాన్ జంక్షన్,జనవరి 9 (వార్తాప్రభ) :** తెలుగువారిసంక్రాంతి పండుగను పురస్కరించుకొని బాపులపాడుమండలం రేమల్లెజిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్ కళ్లేపల్లి నారాయణరావు,లక్ష్మ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో బాపులపాడు మండల డెప్యూటీ ఎం డి ఓ కొల్లూరు సంపత్ కుమార్,మండల విద్యాశాఖాధికారి రామ్ బాలా సింగ్, యనమదల సుదాకరరావు,దేవినేని నన్ హరం,వడ్లమూడి వెంకటకృష్ణారావు, కలపాల రాధాకృష్ణ, యనమదల సాంబశివరావు,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లూథర్ పాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కానుమోలు జిల్లా పరిషత్ హైస్కూల్ లో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో విద్యార్థులు వేసిన ముగ్గులకు కళ్ళేపల్లి నారాయణరావు,లక్ష్మ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, కానుమోలు మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు, సొసైటీ చైర్మన్ దన్నే దుర్గారావు, అంబళ్ళ వెంకట రంగారావు,మోగంటి వేంకటేశ్వరరావు,రాణా సొసైటీ చైర్మన్ సుంకర సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా "వార్తాప్రభ"

● వార్తాప్రభ దిన పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్యప్రసాద్



**హనుమాన్ జంక్షన్,జనవరి 9 (వార్తాప్రభ) :** వార్తాప్రభ దిన పత్రిక అనుక్షణం ప్రజాహితం కోసం కృషి చేస్తుందని శ్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ వీరమాచినేని సత్యప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం హనుమాన్ జంక్షన్ లో వార్తాప్రభ నూతన సంవత్సర క్యాలెండర్ ను స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తా ప్రభ దినపత్రిక ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తుందన్నారు. పత్రికల ప్రాథమిక లక్ష్యం ప్రజల ప్రయోజనమేనని, ఆ దిశగా వార్తాప్రభ వంద శాతం పని చేస్తుందన్నారు. ఇదే ఒరవడి కొనసాగిస్తూ ముమ్ముందు మరింతగా ప్రజా విజయాలు సాధించాలని ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరమాచినేని బుజ్జి, గొట్టాపు వాసు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ఆధ్వర్యంలో హంగర్ రిలీఫ్ ప్రోగ్రామ్



**పెడన,జనవరి 9 (వార్తాప్రభ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ఆధ్వర్యంలో... లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన సేవా కార్యక్రమం ల ప్రారంభోత్సవం సందర్భముగా హంగర్ రిలీఫ్ వీక్ కార్యక్రమములో భాగముగా అమ్మ ఫౌండేషన్ లోని వృద్దులకు ఫుడ్ డొనేషన్ కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించడం జరిగినది. లయన్స్ క్లబ్ అధ్యక్షులు బెజవాడ నాగరాజు మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛంధ సేవా సంస్థ లయన్స్ క్లబ్ ద్వారా పెడన కు సేవ చేయాలనే సదుద్దేశంతో 20 మంది సభ్యులు కలసి లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన పేరుతో ఒక నూతన క్లబ్ ను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం జరిగినది అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ద్వారా విద్యా,వైద్య, ఆరోగ్యం సంక్షమ విషయాలతోపాటుపర్యావరణ పరిరక్షణ దేశ భక్తి సంబంధ విషయాలలో సామాజిక సేవా కార్యక్రమాలు అధిక సంఖ్యలో విస్తృతంగా చేపట్టడం జరుగుతుంది అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ప్రారంభ సేవా కార్యక్రమంగా వృద్దులు,వికలాంగులు, పే దలకు ఉచిత అన్నదాన కార్యక్రమముతో ప్రారంభించు కోవడం జరుగుతుంది అన్నారు. సేవ చేయాలన్న ఆలోచన ఉన్న ప్రతి ఒక్కరు లయన్స్ క్లబ్ లో చేరి లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ద్వారా సేవ చేయవచ్చునని అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ వెంకట రావు మాట్లాడుతూ సమాజములో ఆర్థికంగా వెనకబడి ఆనారోగ్యంతో బాధ పడుతున్న వారితో పాటు అవసరము ఉన్న ప్రతి ఒక్కరికి లయన్స్ క్లబ్ తగిన విధముగా సహాయ సహకారములు అందిస్తుంది అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన కోశాధికారి మామిడి వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సేవా రంగములో మంచి గుర్తింపు ఉన్న లయన్స్ క్లబ్ నందు ఆర్థిక లావా దేవీలు అన్ని పూర్తి పారదర్శకంగా నిర్వహించబడతాయి అన్నారు.సమాజానికి సేవా చేయాలనే తలంపు ఉన్న ప్రతి ఒక్కరు లయన్స్ క్లబ్ ద్వారా సేవలు అందించవచ్చు అన్నారు. అమ్మ ఫుడ్ ఫౌండేషన్ నిర్వాహకులు యర్రా మల్లిఖార్జునరావు చౌడేశ్వరి లు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన సేవా కార్యక్రమంల ప్రారంభ కార్యక్రమం అమ్మా ఫుడ్ ఫౌండేషన్ లో నిర్వహిస్తున్నదుకు తాము లయన్స్ క్లబ్ కి ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటామని అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన ఆధ్వర్యంలో... లయన్స్ క్లబ్ ఆఫ్ పెడన సేవా కార్యక్రమం ల ప్రారంభోత్సవం సందర్భముగా హంగర్ రిలీఫ్ కార్యక్రమంలో అధ్యక్షులు బెజవాడ నాగరాజు తో పాటు ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ వెంకటరావు కోశాధికారి మామిడి వెంకట వర ప్రసాద రావు ఉపాధ్యక్షులు కాగిత శంకర సాంబశివరావు, క్లబ్ సర్వీస్ చైర్మన్ రాయన రాజ కుమార్ క్లబ్ సేవాదళ్ కోఆర్డినేటర్ జె వి కోటేశ్వరరావు క్లబ్ మెంబర్ షిప్ చైర్మన్ పి పైడేశ్వరరావు బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సి హెచ్ శ్రీనివాస గుప్తాఆర్ పవన్ కుమార్ సి హెచ్ వి అప్పారావు లయన్స్ క్లబ్ సేవాదళ్ సభ్యులు బి వెంకటేశ్వర రావు జంపాన శ్రీను ఆకురాతి కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# 5వ వార్డులో సీసీ రోడ్డు,డ్రైన్‌లను ప్రారంభించిన ఎమ్మెల్యే

● రూ.27.76 లక్షల సీఆర్‌డీఏ,15వ ఫైనాన్స్ కమిషన్ నిధులతో మౌలిక సదుపాయాల అభివృద్ధి



**నందిగామ,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక 5వ వార్డులో రూ. 27 లక్షల 76 వేల వ్యయంతో సీఆర్‌డీఏ,15వ ఫైనాన్స్ కమిషన్ నిధుల ద్వారా నిర్మించిన సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ పట్టణంలో ప్రజల ఆరోగ్యం, సౌకర్యం దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతుల అభివృద్ధికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి వార్డులో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థలను సమగ్రంగా అభివృద్ధి చేస్తూ శాశ్వత పరిష్కారాలు అందిస్తున్నామని అన్నారు. సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ నిర్మాణంతో వర్షాకాలంలో నీరు నిలిచిపోయే సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని, పాదాచారులు మరియు వాహనదారులకు సురక్షతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ప్రాంత ప్రజలు ఈ అభివృద్ధి పనులపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యకు మరియు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కే లోవరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శిరీష స్కూల్‌లో 'సంక్రాంతి సంబరాలు'



**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక చౌదరి పేట నందు గల శిరీష్ స్పెషల్ స్కూల్ నందు ఉంటున్న మానసిక వైకల్యం గల చిన్నారులకు సుమారు 50 మందికి సంక్రాంతి చిరుకానుకలు మహమ్మద్ హుస్సేన్ అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ మానసిక వైకల్యం ఉన్న చిన్నారులు దేవునితో సమానం అని వారికి మా అండదండలు ఎప్పటికీ ఉంటాయి అని ఇటువంటి సేవా కార్యక్రమాలు రానున్న రోజుల్లో మరెన్నో చేస్తానని తెలిపారు. స్కూల్ ప్రతినిధులు మాట్లాడుతూ హుస్సేన్ ఇటువంటి గొప్ప కార్యక్రమం చేయడం అభినందనీయమని రానున్న రోజుల్లో ఆయన ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలి అని ఆకాంక్షించారు. సహకరించిన వై నాట్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు మహమ్మద్ హుస్సేన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ రిజ్వాన్, మునగాల నవీన్ సాయి, ముక్కోలు వెంకట రారాజు, గణేష్, చల్లగుల్ల నవీన్ చౌదరి నరేష్ (కింగ్) పాల్గొన్నారు.

# జగన్ ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా రాజధాని నిర్మాణం ఆగదు

● మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వీరాస్వామిన్



**నందిగామ,జనవరి 9 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని కంచల గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ శుక్రవారం పత్రికా విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల శాసనసభ్యులు,మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజధాని అమరావతిపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు.రాజధాని నిర్మాణం జరగకుండా కేసులు వేయించి అడ్డుకోవాలని చూడటం ఆయన సంకుచిత మనస్తత్వానికి నిదర్శమని వీరాస్వామిన్ పేర్కొన్నారు.రివర్ బెడ్ కు, రివర్ బేసిన్కు ఉన్న తేడా కూడా తెలియకుండా జగన్మోహన్ రెడ్డి ఆంధ్ర రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వీరాస్వామిన్ హేళన చేశారు. దేవతల రాజధాని అమరావతి పనులు శరవేగంగా దూసుకెళ్తుంటే ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి అబద్ధాలు, అవాస్తవాలు, ప్రచారం చేస్తున్నారని ఆయన ఎన్ని కుట్రలు చేసినా అమరావతి నిర్మాణం ఆగదని వీరాస్వామిన్ పేర్కొన్నారు.

# గుడివాడ వన్ టౌన్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు



**గుడివాడ,జనవరి 9 (వార్తాప్రభ) :** స్థానిక నాగవరప్పాడు సెంటర్లో పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వన్ టౌన్ మరియు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డిఎస్పీ ధీరజ్ వినీల్ పాల్గొన్నారు. రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగంపై వినియోగదారులకు డీఎస్పీ అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం వల్ల కలిగే ఉపయోగాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులకు నేడు జరిమానాలు విధించామన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని, మూడు ఫైన్లు కట్టకుండా వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చెయ్యడాన్నీ ఆచరణలో పెడతామన్నారు. ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ముందస్తు చర్యల కారణంగా హైవేలపై 50 శాతం ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రతి వాహనదారుడు సురక్షత ప్రయాణం పై దృష్టి పెట్టాలని డిఎస్పి ధీరజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో వన్టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్ఐ పూడి నాగరాజు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యాయమిత్ర స్టైఫండ్ తక్షణమే విడుదల చేయండి..

● ఏపీ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అమలులోకి తెండి

● డిమాండ్ చేస్తూ విధులను బహిష్కరించిన న్యాయవాదులు




**విజయవాడ లీగల్,జనవరి 9 (వార్తాప్రభ) :** జూనియర్ న్యాయవాదులకు ఇవ్వవలసిన న్యాయమిత్ర స్టైఫండ్ రూ.10,000/-ను తక్షణమే విడుదల చేయాలని, అలాగే ఏపీ న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని ఏపీ స్టేట్ బార్ ఫెడరేషన్ తీర్మానం మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బార్ అసోసియేషన్లు ఈరోజు కోర్టు విధులను బహిష్కరిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 12:00 గంటలకు బెజవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ప్రాంగణం నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ప్రభుత్వం పై డిమాండ్లను వెంటనే అమలు చేయాలని కోరుతూ సంబంధిత ప్రభుత్వ అధికారులకు డిమాండ్ మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.కె. బాష మాట్లాడుతూ, రాష్ట్ర న్యాయవాద సంఘం పిలుపు మేరకు ఈరోజు కోర్టు విధులను బహిష్కరించిన బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజున, తొలిసారిగా న్యాయవాదులు ఏకతాటిపై నిలబడి విధులను బహిష్కరించడం ద్వారా న్యాయవాద ఉద్యమంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం, ముఖ్యంగా నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం, జూనియర్ న్యాయవాదులకు రూ.10,000/- స్టైఫండ్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నెలకు రూ.5,000/- చొప్పున స్టైఫండ్ ఇచ్చి, కొంతకాలం తరువాత నిలిపివేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పటి ప్రభుత్వం ప్రకటించిన రూ.10,000/- స్టైఫండ్‌తో పాటు గత ప్రభుత్వ బకాయిలను కూడా కలిపి తక్షణమే మంజూరు చేయాలని ఆయన కోరారు. అలాగే, నారా లోకేష్ తన పాదయాత్ర సందర్భంగా న్యాయవాదులపై జరుగుతున్న అక్రమ దాడుల నుండి రక్షణ కోసం న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ చలసాని అజయ్ కుమార్, సీనియర్ న్యాయవాది మరియు బీజేపీ లీగల్ సెల్ అధ్యక్షులు ఉప్పలపాటి శ్రీనివాస రాజు , మాజీ సెక్రటరీ రాజా తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొని కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా చలసాని అజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వ మేనిఫెస్టోలో పేర్కొన్న న్యాయమిత్ర స్టైఫండ్ మరియు న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేసి ఈ హామీలు కేవలం న్యాయవాదుల ఓట్ల కోసం కాకుండా, న్యాయవాదుల సంరక్షణ కోసమే ఇచ్చినవని నమ్మేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. యీ డిమాండ్లను అమలు చేయని పక్షంలో న్యాయవాదుల ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. అదేవిధంగా ఉప్పలపాటి శ్రీనివాస రాజు మాట్లాడుతూ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ న్యాయవాదుల రక్షణ చట్టం విషయంలో సానుకూలంగా ఉన్నారని, ఈ చట్టాన్ని త్వరలో అమలు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కావున రాష్ట్ర ప్రభుత్వం కూడా జూనియర్ న్యాయవాదులకు ఇచ్చిన న్యాయమిత్ర హామీని వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో న్యాయవాదులందరూ కలసి పెద్ద ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పిల్లా శ్రీనివాస్ , లైబ్రేరియన్ త్రినాథ్ , మాజీ సెక్రటరీ రాజా, అలాగే అనేక మంది సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు సుమారు రూ.14.71.225లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి

● రాష్ట్ర పేద ప్రజల మెరుగైన వైద్యానికి చేయూత ముఖ్యమంత్రి సహాయనిధి రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

● రాష్ట్ర ప్రజలకు సుమారు .5.50కోట్ల మందికి ఎన్. టి. ఆర్.వైద్యసేవలు అందిస్తున్న కూటమి ప్రభుత్వం



**నూజివీడు/ముసునూరు,జనవరి 9 (వార్తాప్రభ) :** ముసునూరు మండల అభివృద్ధి వారి కార్యలయంలో నూజివీడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇటీవల వైద్యం చేయించుకున్న 36 మంది కుటుంబాలకు సుమారు. రూ.14.71.225లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన మంత్రి కొలుసు పార్థసారథి. అపత్కాలంలో ఉన్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి, అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు.ముసునూరు మండలం 7గురు బాధితులకు రూ.2.79.924లక్షలు చాట్రాయి మండలం 11మంది బాధితులకు రూ.4.69.040.లక్షలు నూజివీడు మండలం 6గురి బాధితులకు రూ.2.23.310లక్షలు, నూజివీడు పట్టణంలో 1 కుటుంబానికి రూ.85.158వేలు, ఆగిరపల్లి మండలం 11మంది బాధితలకు రూ.3.13.793లక్షలు. 36మందికి గాను సుమారు. రూ. 14.71225లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన మంత్రి. బాధిత కుటుంబ సభ్యులు తాము ఒక ప్రవేట్ హాస్పటల్లో చికిత్స చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి కొంత ఆర్థిక సహాయం మంజూరు చేయమని మంత్రి వర్యులను అడుగగా మంత్రివర్యులు తక్షణమే స్పందించి ఆర్థిక సహాయం మంజూరు చేయించి బాధిత కుటుంబానికి అందజేశారు. నియోజకవర్గానికి చెందిన పలువురు గతంలో వైద్యం చేయించుకొని ఉన్న బిల్లులను ముఖ్యమంత్రి సహాయ నిధికి అర్జీ చేసుకోవచ్చని మంత్రి అన్నారు. గతంలో వైద్యం చేయించుకున్న వారు వైద్యం చేయించుకున్న బిల్లులను మా కార్యాలయంలో అందజేస్తే ముఖ్యమంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సహాయం వెంటనే అందజేస్తానన్నారు. మెరుగైన వైద్యానికి కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని ప్రజలంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య పరికరాలు,నిపుణులైన సిబ్బంది, అందుబాటులో ఉన్నారని ప్రజలంతా మెరుగైన వైద్యాన్ని సద్వినియోగం చెసుకోవలన్నారు. రాష్ట్ర మంత్రి పార్థసారథికి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న మా కుటుంబాన్ని దేవుడిలా ఆదుకొన్నారని ఇలాంటి మంత్రి కి జీవితాంతం రుణపడి ఉంటామని, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు, కుటుంబ సభ్యులు తమ హర్షాన్ని కృతజ్ఞతను తెలియజేసారు.ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్విత బ్రాండ్ అంబాసిడర్‌గా నందమూరి బాలకృష్ణ

● బ్రాండ్ ఫిల్మ్‌ను ఆవిష్కరించిన సంస్థ సీఎండీ అచ్యుతరావు బొప్పన ● హైదరాబాద్, విశాఖ, అమెరికా, దుబాయ్ లలో నూతన ప్రాజెక్టులు ● విజయవాడలో తొలిసారి అత్యంత ఎత్తైన బహుళ అంతస్తుల భవనాలు




**హైదరాబాద్,జనవరి 9 (వార్తాప్రభ) :** అన్విత గ్రూప్ బ్రాండ్ అంబాసిడర్‌గా నటసింహం, హిందూపురం హ్యాట్రిక్ ఎమ్మెల్యే, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ వ్యవహరించనున్నట్లు సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అచ్యుతరావు బొప్పన ప్రకటించారు. ఈ సందర్భంగా అన్విత గ్రూప్ రూపొందించిన బ్రాండ్ ఫిల్మ్‌ను శుక్రవారం హైదరాబాద్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన అచ్యుతరావు బొప్పన, ఐదు దశాబ్దాలకు పైగా సినీ ప్రయాణంతో పాటు విద్య, ఆరోగ్య రంగాల్లో బాలకృష్ణ గారు చేసిన సేవలు సమాజానికి ఆదర్శమని అన్నారు. మాట తప్పనుఉమడమ తిప్పను అనే విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన బాలకృష్ణ వ్యక్తిత్వం, అన్విత గ్రూప్ మౌలిక సిద్ధాంతాలకు అనుగుణంగా ఉందన్నారు. అందుకే ఆయనను బ్రాండ్ అంబాసిడర్‌గా కావాలని భావించడం, ఆయన ఒప్పుకోవటం సంస్థకు గర్వకారణమని తెలిపారు. 'బిల్డ్ హ్యాపినెస్' అనేదే అన్విత గ్రూప్ నినాదమని, అదే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లగల ప్రతినిధిగా బాలకృష్ణ నిలుస్తారని అచ్యుతరావు బొప్పన పేర్కొన్నారు. సంతోషంతో నిండిన శాశ్వత వారసత్వాన్ని నిర్మించే ప్రయాణంలో ఆయన భాగస్వామ్యం సంస్థకు మరింత బలాన్నిస్తుందన్నారు. గత రెండు దశాబ్దాలుగా దుబాయ్, అబుదాబిలో నివాస, వాణిజ్య, హాస్పిటాలిటీ రంగాల్లో 4 కోట్ల చదరపు అడుగుల నిర్మాణాన్ని పూర్తి చేసిన అన్విత గ్రూప్, ప్రస్తుతం అమెరికాలోని డల్లాస్ నగరంలో లైఫ్‌స్టైల్ కమ్యూనిటీని అభివృద్ధి చేస్తోందని తెలిపారు. హైదరాబాదులో మూడు ప్రధాన ప్రాజెక్టులతో మొత్తం 80 లక్షల చదరపు అడుగుల నిర్మాణం కొనసాగుతోందన్నారు. కొల్లూరులోని అన్విత ఇవానా ప్రాజెక్ట్‌కు షెడ్యూల్‌కు ముందే ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ రావడం విశేషమని, తొలి దశలో 400 యూనిట్లను వినియోగదారులకు అందించనున్నట్లు తెలిపారు. అలాగే అన్విత హై నైన్, మేడ్చల్ అబశ్రీశ్రీలోని అన్విత పార్క్‌సైడ్ ప్రాజెక్టులు నగర జీవనానికి కొత్త నిర్వచనం ఇవ్వనున్నాయని చెప్పారు. భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాలతో పాటు విజయవాడ, విశాఖలలో ప్రపంచ స్థాయి ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు అచ్యుతరావు బొప్పన వెల్లడించారు. విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో నగరంలోనే ఎత్తైన భవనాలను నిర్మిస్తామని చెప్పారు. రాబోయే 5ఉ6 సంవత్సరాల్లో ప్రతి ఏడాది సుమారు వెయ్యి యూనిట్లను వినియోగదారులకు అందించడమే లక్ష్యంగా అన్విత గ్రూప్ ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో అన్విత గ్రూప్ డైరెక్టర్లు నాగభూషణం బొప్పన, శ్రీకాంత్ బొప్పన, విజయరాజు, హ్యాపీ హోమ్స్ డైరెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

# అదే.... పట్టుదల సడలని ఆత్మ విశ్వాసం

● 5వ రోజు కొనసాగిన సహకార సంఘాల ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు

● ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ను కలిసి వినతిపత్రం అందజేసిన సహకార సంఘాల ఉద్యోగులు

● జి.కొండూరులో రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపిన జిఎం రంగబాబు





**జి.కొండూరు/మైలవరం,జనవరి 9 (వార్తాప్రభ) :** తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో పనిచేస్తున్న ఉద్యోగులు గత 5 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నవిషయం తెలిసిందే. ఉద్యోగులు తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన చేస్తున్నప్పటికి ఇంతవరకూ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించలేదు.ఈ రిలే నిరాహార దీక్షలు జనవరి 9వ తేదీ వరకు మాత్రమే ఉంటాయని, తదుపరి రాష్ట్ర జేఏసి ఏ నిర్ణయం తీసుకుంటుందో అనేది తెలియాల్సి ఉంది.మైలవరం కేడిసిసి బ్యాంక్ ఎదుట మండలంలోని ఏడు సహకార సంఘాల ఉద్యోగులు రిలే నిరాహా దీక్షలో కూర్చొని నిరసన తెలిపారు.అలాగే జి.కొండూరు మండలంలోని సహకార సంఘాల ఉద్యోగులు జి.కొండూరు కేడిసిసి బ్యాంకు ఎదుట మండలంలోని అన్ని సహకార సంఘాల ఉద్యోగులు రిలే నిరాహా దీక్షలో కూర్చొని ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ను కలిసిన సహకార సంఘాల ఉద్యోగులు:** ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లిలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించేందుకు విచ్చేసిన మైలవరం నియోజకవర్గం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ను జి.కొండూరు, మైలవరం మండలాలకు చెందిన సహకార సంఘాల ఉద్యోగులు కలిసి వారి గోడు మొరపెట్టుకున్నారు.ప్రభుత్వంపై ఎటువంటి భారం పడని, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని సహకార సంఘాల ఉద్యోగులు ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ను కోరారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన పత్రాన్ని ఎమ్మెల్యే కి అందజేశారు.

**సహకార సంఘాల ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలకు జి ఎం**

**రంగబాబు సంఘీభావం:** జి.కొండూరు కేడీసీసీ బ్యాంకు ఎదుట గత ఐదు రోజులుగా సహకార సంఘాల ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని జిఎం ఎన్.రంగబాబు సందర్శించి తన సంఘీభావం తెలిపారు.సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన ఆకాంక్షంచారు.సంఘాల ఉద్యోగులకు పూర్తి మద్దతు ప్రకటించారు.

అదే పట్టుదల...ఆత్మవిశ్వాసం..ఏ మాత్రం చెక్కుచెదరకుండా తమ సమస్యల పరిష్కారం కోసం సహకార సంఘాల ఉద్యోగుల పోరాడుతు న్నారు.వారు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 5వ రోజు కొనసాగాయి.ప్రభుత్వం తీరు మారకపోతే ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.జే ఏ సి ఇచ్చిన పిలుపు మేరకు జనవరి 9వ తేదీ వరకు మాత్రమే రిలే నిరాహార దీక్షలకు చేయాల్సి ఉంది. తదుపరి రాష్ట్ర జే ఏ సి తీసుకునే నిర్ణయం కోసం సహకార సంఘాల ఉద్యోగుల ఎదురు చూస్తున్నారు. ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే...!



# పండుగ వాతావరణంలో కాకతీయ అపోలో 'మహోత్సవ్'

● 2,600 మంది విద్యార్థులు, వేలాది పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో కళకళలాడిన ప్రాంగణం.





**నందిగామ,జనవరి 9 (వార్తాప్రభ) :** గురువారం స్థానిక కాకతీయ అపోలో విద్యాసంస్థల 40వ వార్షికోత్సవ వేడుకలు మహోత్సవ్ వేడుకలు రెండో రోజూ అంగరంగ వైభవంగా జరిగాయి.సుమారు 2,600 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వేలాదిగా తరలివచ్చిన పూర్వ విద్యార్థులతో నందిగామ పట్టణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి హాజరుకాగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు.

**కాకతీయ అపోలో 40 ఏళ్ల ప్రయాణం ఘనమైంది - తంగిరాల సౌమ్య ..** ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ "వేదికపై ఉన్న పెద్దలకు, ఈనాటి ముఖ్య అతిథి దగ్గుబాటి పురంధేశ్వరికి, కాకతీయ అపోలో విద్యాసంస్థల యాజమాన్యానికి, అధ్యాపకులకు ప్రియమైన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, నందిగామ నియోజకవర్గ ప్రజలందరికీ సౌమ్య హృదయపూర్వక నమస్కారాలు"తెలిపారు. ఈ ఉత్సాహం, ఈ సందడి చూస్తుంటే కాకతీయ అపోలో సంస్థ 40 ఏళ్ల ప్రయాణం ఎంత ఘనమైనదో అర్థమవుతుంది.యాజమాన్యానికి ప్రత్యేక శుభాభినందనలు తెలిపారు. సంస్థను స్థాపించి విద్యారంగంలో అద్భుతమైన సేవలందించిన రవీంద్రనాథ్, భారతి లతో పాటు, వారి వెన్నంటే ఉండి సంస్థను ముందుకు నడిపిస్తున్న కుమారుడు, కోడలు, కుమార్తెలకు ఎమ్మెల్యే సౌమ్య ప్రత్యేక శుభాభినందనలు తెలిపారు. నిన్నటి కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించి, ఒక్క పిలుపుతో ఇంతమంది అతిథులను రప్పించి విద్యార్థులకు స్ఫూర్తిని నింపినందుకు యాజమాన్యానికి శుభాకాంక్షలు.నటరత్న వారసత్వానికి నిలువెత్తు ప్రతిరూపం ముఖ్య అతిథి దగ్గుబాటి పురంధేశ్వరి గురించి మాట్లాడుతూ. తెలుగు ప్రజల ఆరాధ్యదైవం, స్వర్గీయ నందమూరి తారక రామారావు గారాల పట్టిగా ఆమెను చూస్తుంటే సాక్షత్తు ఆ మహానటుడు, ప్రజానాయకుడు మన మధ్యే ఉన్నట్టుగా అనిపిస్తోందని ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు.ఎన్టీఆర్ పట్ల ఉన్న ప్రేమ, గౌరవం ఈ రోజు పురంధేశ్వరి గారి రూపంలో కనిపిస్తోందని అన్నారు.

**చదువుకున్న సరస్వతి - పరిపాలనలో దక్షత మహిళా నాయకులకు దిక్సూచి : పురంధేశ్వరి..** ఐదు భాషల్లో నిష్ణాతులని, పార్లమెంటులో హిందీ, ఇంగ్లీష్‌లలో ఆమె చేసే ప్రసంగాలు దేశమంతా ప్రశంసలు అందుకున్నాయని తెలిపారు.కేంద్ర మంత్రిగా మానవ వనరుల అభివృద్ధి శాఖ బాధ్యతలు నిర్వహించిన సమయంలో 'రైట్ టు ఎడ్యుకేషన్' వంటి విప్లవాత్మక నిర్ణయాల్లో ఆమె పాత్ర మరువలేనిదన్నారు. వాణిజ్య, టెక్స్‌టైల్స్ శాఖల్లో ఆమె పనితీరు నేటి మహిళా రాజకీయ నాయకులకు ఒక దిక్సూచి అని కొనియాడారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి "విద్యార్థులారా పురంధేశ్వరి జీవితం మనందరికీ ఒక పాఠం. ఎంత ఎదిగినా ఒదిగి ఉండటం, హుందాతనాన్ని కాపాడుకోవడం ఆమె నుంచి నేర్చుకోవాలి" అని ఎమ్మెల్యే సౌమ్య సూచించారు.కాకతీయ అపోలో 40 ఏళ్ల ఘన చరిత్రలో ఇలాంటి గొప్ప వ్యక్తుల సమక్షంలో వేడుకలు జరుపుకోవడం విద్యార్థుల అదృష్టమని పేర్కొన్నారు. కళలతో మార్మోగిన ప్రాంగణం మధుర జ్ఞాపకాలుగా నిలిచే ఉత్సవాలు నిన్నటి అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం, రెండో రోజు కూడా కళా ప్రదర్శనలతో ప్రాంగణం మార్మోగింది. ఈ రెండు రోజుల మహోత్సవాలు విద్యార్థుల జీవితాల్లో మధుర జ్ఞాపకాలుగా మిగిలిపోవాలని ఎమ్మెల్యే సౌమ్య ఆకాంక్షంచారు.ప్రిన్సిపాల్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు,ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన కాకతీయ అపోలో విద్యాసంస్థల యాజమాన్యానికి, ముఖ్యంగా ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, భారతి మేడంలకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# చినగొల్లపాలెంలో కోతకు గురి అవుతున్న సుముద్ర ప్రాంతాన్ని పరిశీలించిన

–శాస్త్రవేత్తలు.....ఎంపీ బాల సౌరీ....ఎమ్మెల్యే కాగిత కృష్ణా ప్రసాద్



**కృత్తివెన్ను,జనవరి 9 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలంలో ని సహజ దీవి గా పేరు పొందిన చిన గొల్లపాలెం పంచాయతీ మండలంలోనే విస్తీర్ణం లో పెద్దది ఇక్కడ కొబ్బరి సాగు ద్వారా కొబ్బరి బొండాలు, టెంకాయలు, కొబ్బరి తాడు ఇలా పలు ఉత్పత్తులు రాష్ట్రంలోనే కాదు పక్కా రాష్ట్రాల్లో కూడా పలు ప్రాంతాలకు ఎగుమతి అవుతాయి. ఉంటాయి కానీ ఈ గ్రామం చుట్టూ ఉన్న ఉప్పుటేరు వల్ల ఈ గ్రామ సరిహద్దులు కొద్దీ కొద్దిగా సముద్రంలో కలుస్తున్నాయి. అని ఇంచు మించు పదివేల జనాభా గల పచ్చని పల్లెసీమ అయిన చిన గొల్లపాలెం గ్రామం కు ఇంతకు పూర్వం పడవ ప్రయాణాలే దిక్కు, చినగొల్లపాలెం అని ముత్యం ఐ ఏ ఎస్ లో టాపర్ గా నిలిచిన రేవు ముత్యాల రాజు ఈ గ్రామ నివాసిఏ అయన సంకల్పం వల్లనే ఈ గ్రామానికి బ్రిడ్జి ఏర్పాటు జరిగింది. రాకపోకలు వాణిజ్యం బాగా పెరిగాయి. అయిన కూడా డ్రెజ్జింగ్ సమస్య అలాగే ఉంది అయితే ప్రస్తుత శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ గ్రామస్తుల కోరికపై చలించినా ఎంపీ వల్లభనేని బాల సౌరీ తో కలిసి శుక్రవారం బొట్లుపై సమస్య ఉన్న ప్రాంతాన్ని చెన్నై కు చెందిన శాస్త్రవేత్త లా బృందం తో అధ్యయనం చేసే అడుగులు ప్రారంభించారు. దాదాపు 8000 ఎకరాల విస్తీర్ణం కలిగిన గ్రామంలో యిప్పటికే 1500 ఎకరాల పై చిలుకు కొబ్బరి, సరుగుడు, జీడు మామిడి సాగు చేసే విలువైన భూమి జలర్పణం అయ్యింది. యిప్పటికైనా ఎంపీ వల్లభనేని బాల సౌరీ, శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్ చొరవ వల్లన అయిన సమస్య కొలిక్కి వస్తుంది అని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఈ కార్యక్రమంలో కూటమి నాయుకులు తదితరులు పాల్గొన్నారు

# టీడీపీ సీనియర్ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే యార్లగడ్డ



**హనుమాన్ జంక్షన్, జనవరి 9 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యనమదల వెంకయ్యరావు తీవ్ర అస్వస్థతకు గురై అనారోగ్యం పాలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గన్నవరం ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు గురువారం మల్లవల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వెంకయ్యరావు ఆరోగ్య పరిస్థితిని ఆయన కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పార్టీ కోసం ఎంతో కాలంగా సేవలందిస్తున్న సీనియర్ నాయకులకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఏ అవసరం వచ్చినా తన వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షులు దయాల రాజేశ్వరరావు, మల్లవల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు అక్కినేని ధర్మారావుతో పాటు నాయకులు అక్కినేని కృష్ణాజీ, పుట్టా సురేష్, మువ్వా వేణుగోపాల్, వేగిరెడ్డి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188